# వెలుతురు
తెలుగు దినపత్రిక




**హనుమాన్ దీక్షదారులకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారికి స్వయంగా భోజనం వడ్డించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు మే 19:**
ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమాన్ దీక్షదారులకు సోమవారం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

## ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం
# గిరిజనులకు వరం...



- రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ప్రారంభించడం ఆనందకరం...
- మాచారంలో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ఘనంగా స్వాగతం పలికిన ఉన్నతాధికారులు
- ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం
- మాచారం బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మాచారం వెలుతురు మే 19:**
తెలంగాణ ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఈ విషయంలో మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి వర్గం ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యేలు... నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ ప్రాంతంలో ఉన్న మాచారంలో సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో మాచారంకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ బాదావత్ సంతోష్, ఉన్నతాధికారులు పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు స్థానికంగా ఉన్న సీతరామాంజనేయ స్వామి ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల కోసం రూ.12,600 కోట్లకు సంబంధించిన నల్లమల డిక్లరేషన్ను ఆవిష్కరించారు. అంతకు ముందు ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం పైలాన్ను ప్రారంభించారు. అనంతరం మాచారంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ... ఒకప్పుడు నల్లమల్ల ప్రాంతం అంటే ఎంతో వెనుకబడిన ప్రాంతమని... ఎవరో నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలనే వారు... కానీ ప్రస్తుతం ప్రజల ఆశీస్సులతో ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా వచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన మహేంద్రనాథ్, ఉత్తమ



## నల్లమల డిక్లరేషన్ చారిత్రాత్మకం

- గిరిజనుల జీవితల్లో వెలుగులు నింపేది
- వెయ్యికోట్లతో రాజీవ్ యువవికాస్ ప్రారంభం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

**అమ్రాబాద్,మే19( వెలుతురు):**
భూమి కోసం ఈ గడ్డపై పోరాటాలు జరిగాయని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది అని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ప్రారంభ బహిరంగ సభలో డిప్యూటీ– సీఎం ప్రసంగించారు. నల్లమల డిక్లరేషన్ సందర్భంగా భట్టి



## 5364 ఇందిరమ్మ ఇండ్లకు రూ. 53.64 కోట్లు చెల్లింపు

- ఇప్పటివరకు 20,104 ఇండ్ల గ్రౌండింగ్
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు మే 19:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఇండ్లనిర్మాణ పనులు పూర్తయిన మేరకు ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,





## మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షాపై సుప్రీం ఆగ్రహం

- మొక్కుబడి క్షమాపణలు అంగీకరించలేమని వెల్లడి
- కల్నల్ సోఫియాపై వ్యాఖ్యలపై సిట్ ఏర్పాటుకు ఆదేశం

## డిక్లరేషన్లు కాదు.. డెడికేషన్ కావాలి

- గతంలో ప్రకటించిన డిక్లరేషన్లు ఏమయ్యాయి
- కాంగ్రెస్ నల్లమల డిక్లరేషన్‌పై హరీష్ విమర్శలు




## యుద్ధానికి విరామమే తప్ప
# ముగియలేదు



**కరీంనగర్ వెలుతురు మే 19:**
*యుద్ధానికి విరామమే తప్ప ముగియలేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. దేశానికి ఆపదొస్తే టెర్రరిస్టుల అంతూ చూసేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సింధూర్ తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. పాకిస్తాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టిన ఘనత మన సైనికులదేనని కొనియాడారు. నరేంద్ర మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు.*
బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున సాయంత్రం కరీంనగర్ లోని గీతాభవన్ చౌరస్తా నుండి రాంనగర్ చౌరస్తా నుండి 'తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు జాతీయ జెండాను చేతబట్టి ఈ ర్యాలీకి తరలివచ్చి ప్రధాని మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే.....
పహల్గాంలో అమాయక హిందువులపైన, ప్రజలపైన ఉగ్రవాదులు జరిపిన దాడి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో భారత సైనికులు పాకిస్తాన్ లోని టెర్రరిస్టుల శిబిరాలను ధ్వంసం చేశారు. మోదీకి, సైన్యానికి సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నాం. అందులో భాగంగానే కరీంనగర్ లో నిర్వహించిన ర్యాలీకి భారీ ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. వారందరికీ క్రుతజతలు పాకిస్తాన్ సామాన్య ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఆ దేశంలోకి వెళ్లి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన తీరు అమోఘం. దాదాపు 100 మంది టెర్రరిస్టులను మట్టుబెట్టిన ఘనత సైనికులదే. మోదీ నాయకత్వ పటిమను చూసి యావత్

- దేశానికి ఆపదొస్తే అంతు చూసేందుకు మన సైన్యం రడీ
- ఆపరేషన్ సింధూర్ తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసింది
- పాకిస్తాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టినం
- మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా 'తిరంగా ర్యాలీ'
- మోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా కొనసాగడం నా అద్రుష్టం
- కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వర్తిస్తూ సైన్యం సాహసాలను కళ్లారా చూసే భాగ్యం కలిగింది
- 'తిరంగా ర్యాలీ'లో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్
- కరీంనగర్ తెలంగాణ చౌక్ నుండి రాంనగర్ వరకు 'తిరంగా ర్యాలీ' నిర్వహించిన బీజేపీ
- భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, బీజేపీ కార్యకర్తలు

## ప్రమాదస్థలిని ఎందుకు సందర్శించలేదు



- ప్రజల ప్రాణాలపై కూడా దృష్టి పెట్టరా
- సిఎం రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,మే19( వెలుతురు):**
అందాల పోటీలకే కాదు సామాన్య ప్రజలకు కడా రక్షణ కల్పించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. పాతబస్తీలోని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కెటిఆర్ ఫైరయ్యారు. అందాల పోటీల మీద పెట్టే ఖర్చు.. ప్రజల ప్రాణాలు కాపాడడానికి కూడా పెట్టాలని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘటనా

## ఆపరేషన్ సిందూర్‌తో
# పాక్ కుయుక్తులు

- స్వర్ణదేవాలయంపై దాడికి యత్నం
- తిప్పకొట్టిన భారత సైన్యం
- వీడియోలు విడుదల చేసిన ఆర్మీ

**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**
పాకిస్తాన్ దాష్టీకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నారు. భారత దేశంలో ప్రార్థనామందిరాలు, ఆలయాలపై దాడులు చేయడం ద్వారా అంతర్గత విభేదాలకు తెరలేపాలని చూసింది. ఇటీవలి దాడుల్లో ఇదే లక్ష్యంగా భారత్‌లో ప్రముఖ స్థలాలపై డ్రోన్ దాడులకు తెగించింది. ఇందులో స్వర్ణదేవాలయం కూడా ఉన్నట్లు



## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో
# విస్తుపోయే నిజాలు

- దాడికిముందు పహల్గామ్‌ను సందర్శించినట్లు గుర్తింపు
- వీడియోలు తీసి పాక్‌కు పంపినట్లు నిర్ధారణ




**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**
గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు అక్కడ వీడియోలు తీసినట్లు కూడా

## పథకాల అమలులో పారదర్శకత ముఖ్యం

- క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాలు చేరాలి
- కార్యక్రమాల అమలుకు మళ్లీ ఆకస్మిక తనిఖీలు
- సమీక్షలో అధికారులతో సిఎం చంద్రబాబు

**అమరావతి,మే19( వెలుతురు):**
పథకాల అమలుతీరును, అధికారుల పనితీరును బేరీజు వేస్తానని, ఇందుకోసం మళ్లీ ఆకస్మిక తనిఖీలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే నెల 12 నుంచే ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. ప్రజా సేవ పథకాల అమలు, సంక్షేమ పథకాల పూర్తిస్థాయి సంతృప్తి ఇంకా కనిపించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రేషన్, దీపం-2, ఆర్టీసీ, పంచాయతీ సేవలపై అభిప్రాయాలను పరిశీలించారు. పథకాలు, పౌరసేవలపై జూన్ 12 తర్వాత ఆకస్మిక



(మొదటి పేజీ తరువాయి..)

## హనుమాన్ దీక్షదారులకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారికి స్వయంగా భోజనం వడ్డించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



శ్రీ సీతారామ సహిత ఆంజనేయ స్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేయగా... జై శ్రీ రామ, జై హనుమాన్ నామ స్మరణతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. పెద్ద సంఖ్యలో హాజరైన దీక్షదారులకు మహా ప్రసాదాన్ని అందించారు. వారికి ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. చెడు అలవాట్లను వీడి సన్మార్గంలో నడవడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు.

# నల్లమల డిక్లరేషన్ చారిత్రాత్మకం

మాట్లాడుతూ..సంక్షేమం కోసం తెచ్చిన గొప్ప కార్యక్రమం ఇదని, అటవీ సంపద ఫలాలు పూర్తిగా గిరిజనులకే దక్కాలని చెప్పారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజన కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, భూములే కాదు వాటిని చదును చేసేందుకు నిధులు ఇస్తున్నామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రతి పైసా ప్రజలకే ఖర్చు చేస్తోందని, నిత్యం ప్రజల కోసం ఈ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలనే ఈ కార్యక్రమం తెచ్చామని, తమపై చేసే అనవసర విమర్శలను కుట్రలగానే చూస్తామని అన్నారు. సంపద సృష్టిస్తాం.. సృష్టించిన సంపద పేదలకు పంచుతాం..ఇదే తమ నినాదమని భట్టి చెప్పారు. రూ.వెయ్యి కోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభి స్తున్నామని, జూన్ 2 న రాజీవ్ యువ వికాసం పత్రాలు కూడా ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క మల్లు అన్నారు.తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు.. దేశంలోనే గర్వించదగిన గొప్ప కార్యక్రమమని కొనియాడారు. గత ప్రభుత్వంలో గిరిజనులు పంట పండించుకోవడానికి వెళితే మహిళలని చూడకుండా చెట్టు-కు కట్టేసి కొట్టారని.. పురుషులపై పోలీసు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెంద వద్దని, ఫలితాలు ప్రజలకు అందవద్దని నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై ఒక మాట అన్న, కుట్ర చేసిన అది రాష్ట్ర ప్రజలపై కుట్రగానే భావిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతు న్నామని తీపి కబురు చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం మన ప్రభుత్వం గుండెల్లో పెట్టు-కొని కాపాడుకోండని పిలుపునిచ్చారు.. ఇందిరా జల వికాసం ఆరంభం మాత్రమే కాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో యావత్ క్యాబినెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నల్లమల్ల సాక్షిగా మాట ఇచ్చారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఓ ఉమ్మడి కుటుంబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించ బోతున్నామని తెలిపారు.

## యుద్ధానికి విరామమే తప్ప ముగియలేదు

ప్రపంచమంతా శెభాష్ అంటోంది. కరోనా, ఆపరేషన్ సింధూర్ వంటి క్లిష్ట సమయాల్లో మన దేశానికి ఏది మంచిదో, ఎప్పుడు ఏం చేయాలో ఆచరిస్తూ టాప్ 5 దేశాల సరసన భారత్ ను నిలిపిన నేత మోదీ...అంతటి గొప్ప నాయకుడు మా ఇంట్లో, మా ఊర్లో పుడితే బాగుండేదని భావిస్తున్నారంటే ఆయనపట్ల ఎంత అభిమానముందో అర్ధం చేసుకోవచ్చు. మతం పేరు అడిగి ప్రజలను చంపడం దుర్మార్గం. పెహల్గామ్ ఉగ్రదాడి మానవత్వానికే మాయని మచ్చగా నిలిచింది. పిల్లల ముందు తండ్రిని, భార్యల ముందు భర్తను, ప్యాంటు విప్పి కాల్చి చంపాలని ఏ మతం చెప్పింది?ఉగ్రవాదుల అరాచకాలకు అంతులేకుండా పోతోంది. 2005, 2006లో ముంబై లోకల్ ట్రైన్లలో బాంబుపేలుళ్లు, ముంబయి పేలుళ్లు, కోయంబత్తూరు, జామా మసీదు పేలుళ్లు... హైదరాబాద్ లో గోకుల్ చాట్, లుంబనీపార్కు, దిల్ సుఖ్ నగర్, మక్కా మసీదు పేలుళ్లు ఇంకా గుర్తుకొస్తున్నయ్. దేశంలో అల్లర్లు సృష్టించి అల్లకల్లోలం చేయాలని కుట్ర చేసింది. అందుకే మోదీ నాయకత్వంలో మన సైన్యం 'యురి'లో మన సైనికులపై దాడి చేస్తే POK వెళ్లి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినం.. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా జైషే మహమ్మద్ హెడ్‌క్వార్టర్స్‌పై సర్జికల్ స్ట్రయిక్స్.... ఏప్రిల్ 22న పెహల్గామ్‌లో ఉగ్రవాద ఘటనకు ప్రతీకారమే ఆపరేషన్ సింధూర్... 23 నిమిషాల్లోనూ పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాల ధ్వంసం.... 100దాకా ఉగ్రవాదుల హతం... యుద్ధానికి విరామమే తప్ప ముగిసినట్లు కాదు.. దేశానికి టెర్రరిస్టులవల్ల ఎప్పుడు ముప్పు వాటిల్లినా వాళ్ల అంతు చూస్తాం.. "ఆపరేషన్ సింధూర్" పేరుతో అద్భుతమైన సేవలందించిన మన భారత సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేస్తూ నిర్వహిస్తున్న ఈ "తిరంగా యాత్ర... మద్దతిస్తున్న సమస్త ప్రజానీకానికి శతకోటి వందనాలు. నరేంద్రమోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగడం నా అదృష్టం. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వర్తిస్తూ భారత సైనికుల ధైర్యసాహసాలను కళ్లారా చూసే అదృష్టం నాకు కలిగింది. మన భారత సైనికులను చూసి గర్విస్తున్నా...

## మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షాపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**

ఆర్మీ అధికారిణి కర్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విషయంలో ఆయన క్షమాపణలను అంగీకరించలేమన్న అత్యున్నత న్యాయస్థానం.. మంత్రి వ్యాఖ్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని ఆదేశించింది. మొక్కుబడి క్షమాపణలు అంగీకరించలేమి హెచ్చరించింది. అయితే, ప్రస్తుతానికి ఆయన అరెస్టుపై స్టే విధించింది. క్షమాపణలు ఎక్కడ చెప్పారు? ఎలా చెప్పారు? సారీ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు- నటిస్తారు. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో మీ క్షమాపణ ఎలాంటిది. ఏదో న్యాయస్థానం అడిగింది కాబట్టి చెబుతున్నా అన్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏంటని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. మీరో ప్రజాప్రతినిధిగా ఉన్నారు. అలాంటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతీ పదాన్ని ఆచితూచి మాట్లాడాలి. మీ వీడియోను మేం చూశాం. చాలా అభ్యంతరకరంగా మాట్లాడారు. మీ వ్యాఖ్యల పట్ల యావత్ దేశం సిగ్గుపడుతోందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం మంగళవారం ఉదయం 10 గంటల్లోపు సిట్‌ను ఏర్పాటు- చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. రాష్ట్రానికి చెందని ముగ్గురు ఐపీఎస్‌లు అందులో ఉండాలని, వారిలో ఒకరు ఎస్పీ ర్యాంక్ కలిగిన మహిళా అధికారి ఉండాలని సూచించింది. అయితే, ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన కోర్టు.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆమెను విజయ్ షా 'ఉగ్రవాదుల సోదరి'గా పేర్కొనడంపై దుమారం రేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు.. ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఆయన క్షమాపణలు చెప్పాలని గత విచారణలో న్యాయస్థానం ఆదేశించింది.

## ప్రమాదస్థలిని ఎందుకు సందర్శించలేదు

స్థలానికి వచ్చి బాధితులను పరామర్శించాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సోమవారం అగ్ని ప్రమాద ప్రదేశానికి వెళ్లి కెటిఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ కుటుంబంలో జరిగిన విషాద ఘటన ఇంకొకరికి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత పెద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్‌లో ఆక్సిజన్ మాస్క్ లేకుండా, ఫైర్ ఇంజన్‌లో నీళ్ళు లేకుండా ఘటనా స్థలానికి రావడం వల్లనే మా కుటు-ంబ సభ్యులను కోల్పోయాం అని బాధితులు చెప్తున్నారని అన్నారు. పాతబస్తీలోని గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటు-ంబాలకు రూ.5 లక్షలు కాదు.. రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. కాగా, ఈ ప్రమాదంపై స్పందించిన ప్రభుత్వం.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు.

# ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం గిరిజనులకు వరం...





పార్లమెంటేరియన్గా రాణించిన జైపాల్రెడ్డి, రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావులు పుట్టిన ప్రాంతమని...ఈ విషయంలో తను నల్లమల్ల బిడ్డగా ఎంతో గర్వంగా ఉందన్నారు. పాలమూరు జిల్లా బిడ్డలను అప్పట్లో అన్ని ప్రాంతాల్లో కూలీ పనులు చేసేందుకు పిలిచేవారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అలాగే ఈ నల్లమల్ల అటవీ ప్రాంతంలో నల్లమల్ల డిక్లరేషన్ సహచర మంత్రి వర్గంతో కలిసి చేయడం సంతోషమని... అప్పట్లో తాను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను గెలించాలని ఎన్నికల సమయంలో తాను కోరగా యాభైవేల పైచిలుకు మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారని.. ప్రస్తుతం 65 మంది శాసనసభ్యులు ఉండటం వల్ల తాను నల్లమల్ల బిడ్డ గా చెప్పుకోవడానికి గర్వంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఎంత బాధ్యత ఉందో తనకు ముఖ్యమంత్రిగా అంతే బాధ్యత తనకు ఉందని... నల్లమల్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని... నిధులు విడుదల చేయాలని... ఈ ప్రాంతంలో ఉద్యోగ, విద్యను అందించాలని మంత్రులకు తెలియజేశానన్నారు. ఈ ప్రాంతంలో రైతన్నలు దున్నుకుంటే పోడుభూములు మంచి భూములుగా మారాయని... ప్రస్తుతం గిరిజనులు ఆత్మగౌరవంతో ఉండే విధంగా ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోజు తమ చెంచు ఆడపడుచులతో మాట్లాడితే అలివేలు అనే మహిళ తోటల పెంపకం గురించి అవగాహన కల్పించుకున్నారని ఈ విషయంలో ఆనందకరంగా ఉందన్నారు. అలాగే ఇళ్ళకు, వ్యవసాయ అవసరాలకు సోలార్ విద్యుత్తుపై అవగాహన కల్పించడంతో పాటు సోలార్తో విద్యుత్తు అవసరాలు తీర్చుకునేలా ఇళ్ళకు సైతం ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్కు ఆదేశాలిచ్చినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం అచ్చంపేట నియోజకవర్గంలో ఉన్న రైతులందరికీ సోలార్ పంపుసెట్లను రాబోయే వంద రోజుల్లో ఉచితంగా అందచేయడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో అచ్చంపేట ప్రపంచానికి, దేశానికి ఆదర్శమని తెలిపారు. 2023 డిసెంబరు 7వ తేదీన అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో రైతులకు అన్ని రకాలుగా ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు. అప్పట్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని చెప్పారని కానీ తమ ప్రభుత్వంలో సన్నరకం వడ్లను పండించినట్లయితే రూ.500 బోనస్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వరి పండిస్తే ఉరి వేసుకోవడం మాట పక్కనపెట్టి లాభం చేకూరుతుందని... సన్న వడ్లు పండించమని తాను చెప్పిన రోజు కొందరు నాయకులు అవహేళన చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అలాగే ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా అందరికీ సన్నబియ్యం అందిస్తున్నామని ఈ విషయంలో మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల ఇళ్ళల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నబియ్యంతో భోజనాలు చేసిన మాట వాస్తవమన్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యం ఆత్మగౌరవాన్ని పెంచుకునే విధంగా మారిందన్నారు. రైతులు పండించిన సన్నవడ్లను తిరిగి ప్రజలకు సన్న బియ్యంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే ఆడబిడ్డలు, పొదుపు సంఘాల సభ్యులకు ఆర్టీసీ బస్సులను సైతం ఇచ్చి వాటికి ఆడబిడ్డలను యజమానులను చేసిన ఘనత తమకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఒకప్పుడు సోలార్ అంటే అదాని, అంబానీలకే అనుకునే వారని... ప్రస్తుతం ఆడబిడ్డలకు, గిరిజన పుత్రులకు సైతం అందించడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు ఆడబిడ్డలకు పెట్రోల్ బంకులు సైతం కేటాయించి వారే స్వయంగా నడిపే విధంగా చేశామన్నారు. ఆడబిడ్డలకు హైదరాబాద్ శిల్పారామం పక్కన స్థలం కేటాయించి వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి అదాని, అంబానీలతో పోటీ పడే విధంగా చేశామన్నారు. అలాగే రాబోయే రోజుల్లో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని.. ఒక ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడి ఎదిగితే ఆ కుటుంబం, ఆ ప్రాంతం ఎదుగుతుందని తెలిపారు. ఈ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రైతులను, నిరుద్యోగులు, విద్యార్థులను ఆదుకున్న ఘనత తమకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాము వచ్చిన మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వ ఉద్యోగాలు60 వేలు ఇవ్వగా ప్రైవేట్ ఉద్యోగాల్లో కూడా చోటు కల్పించినట్లు తెలిపారు. అదే విధంగా 12 యూనివర్సిటీల్లో వైస్ఛాన్సలర్లను నియమించినట్లు అప్పుడే సరైన విద్య అందుతుందని అందుకు తార్కాణంగా వారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేషన్ స్కూళ్ళను కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే హైదరాబాద్కు ప్రపంచ దిగ్గజ కంపెనీలను తీసుకురావడం జరిగిందని ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్ రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే శాంతిభద్రతల విషయంలో సైతం తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని పన్నుల వసూళ్ళలో సైతం నెంబర్ వన్ రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాలమూరు జిల్లా వారికి పాలన చేతకాదని అవహేళన చేసే వారికి తాము తట్ట, పార పనితో పాటు పరిపాలన కూడా చేస్తామని ఏడాదిన్నరలో నిరూపించామన్నారు. ఈ విషయంలో మరింత ముందుకెళ్ళాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే అచ్చంపేటను ఆదర్శంగా తీర్చదిద్దినట్లే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో చేయడం జరుగుతుందని అందుకు ప్రజల సహకారం ఎంతైనా అవసరమన్నారు. అప్పట్లో భూమి కోసం... భుక్తి కోసం పోరాటాలు స్వేచ్ఛ, భూమి కోసం జరిగిన పోరాటాలని... వాటిని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు 25 లక్షల ఎకరాల భూములను అందించి పేదలకు ఆత్మగౌరవాన్ని అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఇందిరమ్మ రాక ముందు వెట్టిచాకిరీ చేసేవారని అసైన్మెంట్ పట్టాల కింద భూములు అందించిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇందిరాగాంధీ వల్లే సాధ్యమైందన్నారు. పెహల్గామ్ విషయంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎలా ఉండాలంటే ఇందిరాగాంధీ 54 సంవత్సరాల క్రితంలా ఉండాలని ప్రతి ఒక్కరికీ తెలిసివచ్చిందన్నారు. ప్రతి పేదవారి గుండెల్లో తండాల్లో, గూడేల్లో ఇందిరాగాంధీ ఉన్నారని తెలిపారు. అందువల్లే ఈ పథకానికి ఇందిరా సోలార్ వికాసం పథకంగా పేరు పెట్టినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని ఈ విషయంలో కొందరు కుట్రలు చేస్తున్నారని వారిని ఎలా తిప్పి కొట్టాలో తమకు తెలుసన్నారు. అలాగే స్కూళ్ళు, రెసిడెన్షియల్ హాస్టళ్ళలో ఆడబిడ్డలకు 200 కాస్మొటిక్ ఛార్జీలు పెంచడంతో పాటు 50 లక్షల కుటుంబాలు గృహజ్యోతి ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రజలకు నిజం ఏమిటో తెలుసునని... నిజాన్ని నిర్భయంగా చెప్పాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు ఈ విషయంలో ముందుండాలన్నారు. అలాగే బ్యాంక్ లింకేజీ ద్వారా ఆడబిడ్డలకు లబ్ధి చేకూర్చామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంను దేశంలోనే ఆదర్శంగా నిలుపుతానని... అందుకు 24 గంటల పాటు శ్రమిస్తానని దీనికై ప్రతి ఒక్కరి ఆశీస్సులు అవసరమన్నారు. అనంతరం అచ్చంపేట నియోజకవర్గానికి రూ.119 కోట్లతో స్వయం సహాయక బృందాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందచేశారు. గిరిజనులకు మంచి చేసే తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలను అందచేశారు.

## డిక్లరేషన్లు కాదు..డెడికేషన్ కావాలి

**హైదరాబాద్,మే19( వెలుతురు):**

ఆర్భాటంగా డిక్లరేషన్లు ప్రకటించడమే తప్ప.. అమలు చేసే డెడికేషన్ మాత్రం అస్సలు లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అమలు చేస్తామన్న రైతు డిక్లరేషన్ ఆగమైపోయింది.. బీరాలు పలికిన బీసీ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందని.. ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ తెరమీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. పైన పటారం లోన లొటారం డిక్లరేషన్ల పేరిట డంబాచారమని సెటైర్ వేశారు. తాను నల్లమల బిడ్డనని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. తనను కలుసుకోవడానికి వచ్చిన అమాయక చెంచు బిడ్డలను అరెస్టు చేసి తన నిరంకుశ నైజాన్ని మరోసారి బయటపెట్టు-కున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించి నల్లమల డిక్లరేషన్ ప్రకటించడమే ప్రజా పాలనా అని ప్రశ్నించారు. ఎప్పటిలాగే రేవంత్ ప్రసంగంలో తెచ్చి పెట్టు-కున్న ఆవేశం తప్ప, కం-టె-ంట్ లేదు, కాం-టె-స్ట్ లేదని అన్నారు. ఆత్మస్తుతి పరనింద తప్ప, అక్కరకు వచ్చే ముచ్చట లేదని విమర్శించారు. అలవా-టైన ఊకదంపుడు ప్రసంగాన్నే అదే పనిగా దంచాడని అన్నారు. తమ పరిపాలన ప్రయోజానలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారని డబ్బా కొట్టు-కున్నడని చెప్పారు. అవును రేవంత్ రెడ్డి గారూ.. మీ అసమర్థ పాలనలో అమలు కాని హామీలను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారు అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రుణమాఫీ ఎగ్గొట్టినందుకు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ బావురుమంటు-న్నందుకు.. కల్లాల దగ్గర పడిగాపులు కాస్తూ కన్నీరు పెట్టు-కుంటు-న్నందుకు.. వడగండ్లతో పంట నష్టపోయి గుండెలు బాదుకుంటు-న్నందుకు రైతులు.. మిమ్మల్నే గుర్తు చేసుకుంటున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి కింద నెల నెలా రావాల్సిన 2500 ఇంకా రావడం లేదని ఆడబిడ్డలు.. కల్యాణ లక్ష్మి కింద రావాల్సిన తులం బంగారం కోసం ఆడపిల్ల తల్లిదండ్రులు.. మీరిస్తామన్న స్కూటీ-ల కోసం ఆశగా ఎదురు చూస్తున్న యువతులు.. పదే పదే గుర్తు చేసుకుంటు-న్నారని అన్నారు. విద్యాభరోసా కింద ఇస్తామన్న 5 లక్షల కార్డు కోసం విద్యార్థులు.. ఏడాదిలో ఇస్తామని చెప్పి ఏడాదిన్నర దాటు-తున్నారని 2లక్షల ఉద్యోగాల కోసం, ఏ నెలకు ఆ నెలకు ఖాళీలను భర్తీ చేస్తూ ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు గుర్తు చేసుకుంటు-న్నారని చెప్పారు. ఇంకా పింఛన్లు పెంచుతలేవని అవ్వాతాతలు, దివ్యాంగులు, నిస్సహాయులు.. డీఏ, పీఆర్సీ, పింఛన్ ప్రయోజనాల కోసం ఉద్యోగులు, రి-టైర్డ్ ఉద్యోగులు.. తమను ఎప్పుడు ప్రభుత్వంలో విలీనం చేస్తారా అని ఆర్టీసీ కార్మికులు నిత్యం నిన్నే తలుచుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి అతిశయోక్తులు ఎట్లా ఉంటాయంటే, అమాస నాడు పున్నమి వెన్నల అనగలడని హరీశ్‌రావు సె-టైర్ వేశారు. ఓవైపు నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటే, నిరుద్యోగులే నోటిఫికేషన్లు వద్దంటు-న్నారని తుపాకీ రాముని డైలాగులు పేలుస్తూ కామెడీ చేస్తున్నడని అన్నారు. దేశాలు తిరిగి తెచ్చామని ప్రచారం చేసుకుంటు-న్న పెట్టు-బడుల వ్యవహారం ఎట్లుందంటే, సచ్చిపోయిన బర్రె పగిలి పోయిన కుండెడు పాలు ఇచ్చిందన్న చందంగా ఉందన్నారు. అసలు ఆరు గ్యారెంటీల ఊసెత్తడమే మానేసిండు. ఇంతకన్నా మోసం, దగా ఇంకేం ఉంటుందని మండిపడ్డారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు రాష్ట్రం దివాలా, దివాలా అన్న పాట మాత్రం పాడలేదు. నెంబర్ వన్ రాష్ట్రం అని మాట మార్చిండు అన్నారు. రేవంత్ రెడ్డి రంగులు మార్చే తీరును చూసి నల్లమల అడవుల్లోని ఊసరవెల్లులు కూడా నివ్వెరపోతున్నాయని విమర్శించారు.

# ఆపరేషన్ సింధూర్‌తో పాక్ కుయుక్తులు

సైనికాధికారులు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు. మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు- పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. పాక్‌కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారని మేజర్ జనరల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. మన ఎస్-400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్ట్రన్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాక్ పర్యటన

***ఐఎస్ఐ ఆహ్వానం ఉందన్న సిఎం బిశ్వ శర్మ***

**గౌహతి,మే19( వెలుతురు):**

పాకిస్తాన్ ఇంటె-లిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాకిస్తాన్‌లో పర్యటించారని, ఐఎస్ఐతో సన్నిహితంగా వ్యవహరించారని అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వ శర్మ చేసిన సంచలన ఆరోపణలు వ్యవహారం మరింత ముదురుతోంది. తాజాగా తన వాదనను హిమంత్ బిస్వ శర్మ మరింత బలంగా వినిపించారు. తాను చెప్పింది తప్పని తేలితే సీఎం పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.

## 5364 ఇందిరమ్మ ఇండ్లకు రూ. 53.64 కోట్లు చెల్లింపు

హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బేస్ మెంట్ పూర్తిచేసుకున్న 1383 ఇండ్లకు , గోడలు పూర్తియిన 224 ఇండ్లకు సోమవారం నాడు 16.07 కోట్ల రూపాయిలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మొత్తంగా ఇప్పటివరకు బేస్ మెంట్, గోడలు పూర్తిచేసుకున్న 5, 364 లబ్దిదారులకు రూ, 53.64 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు.సోమవారం నాడు జూమ్ మీటింగ్ ద్వారా లబ్దిదారుల చెల్లింపులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా ఇప్పటి వరకు 20,104 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని ఇందులో 5140 ఇండ్లు బేస్‌మెంట్, 300 ఇండ్లు గోడల నిర్మాణం వరకు మరో పది ఇండ్లు శ్లాబ్‌ల వరకు పూర్తయ్యాయని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తున్నామని తెలిపారు. బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. వానాకాలాన్ని దృష్టిలోపెట్టుకొని వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తిజరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వెలుతురు

# ప్రొఫెసర్ జి. ప్రభాకర్ (గైడ్, జియాలజి విభాగం), ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్ డీ అవార్డును అందుకున్న డాక్టర్ పి. ప్రకాశ్



**హైదరాబాద్ వెలుతురు మే 19:** మహబూబాబాద్ జిల్లాలోని చిన్న గూడూరు మండల కేంద్రానికి చెందిన ప్రతాపని కృష్ణమూర్తి, సువర్ణం దంపతుల మూడవ కుమారుడైన ప్రతాపని ప్రకాశ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో జియాలజీ విభాగం నుండి జియాలజీలో పిహెచ్ డీ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ప్రొఫెసర్ (జియోలాజీ విభాగం) మరియు యూనివర్సిటీ – సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అయిన డాక్టర్ జి. ప్రభాకర్ గారి మార్గదర్శకత్వంలో " తెలంగాణ రాష్ట్రంలోని జనగాం జిల్లా, రఘునాథపల్లి వాటర్షెడ్లో భూగర్భ జలాలు మరియు ఉపరితల జలనిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ రిమోట్ సెన్సింగ్ మరియు GIS అధ్యయనాలు" అనే అంశం పై డాక్టర్ ప్రకాశ్ పరిశోధన చేశారు. ఆయన జలవనరులు మరియు భూగర్భశాస్త్ర రంగాలలో రిమోట్ సెన్సింగ్ మరియు GIS టెక్నాలజీలను ఉపయోగించడంలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. గతంలో, ఆయన కర్ణాటకలో ప్రపంచ బ్యాంక్ నిధులతో నడిచే "జల్ నిర్మల్ ప్రాజెక్టు"లో మరియు "రాజీవ్ గాంధీ త్రాగునీటి మిషన్" ప్రాజెక్టు( తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్)లలో పని చేశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక విభాగం కింద తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (TGRAC)లో సైంటిఫిక్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. పిహెచ్ డీ పట్టా పొందిన సందర్భంగా ఆయన గైడ్ – జి. ప్రభాకర్ గారికి, జియాలజి విభాగం సిబ్బంది (ఉస్మానియా విశ్వవిద్యాలయం), TGRAC సిబ్బంది, కుటుంబసభ్యులు, స్నేహితులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మరియు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

### సమాచార శాఖ కమిషనర్లుగా

# బీసీలు అర్హులు కారా ??

- ప్రస్తుతం నియమించిన అభ్యర్థులను పునః పరిశీలించాలని బీసీ నేత జాజుల లింగంగౌడ్ డిమాండ్



**హైదరాబాద్ వెలుతురు మే 19:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన సమాచార శాఖ కమిషనర్ లలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం నియమించిన సమాచార శాఖ ప్రధాన కమిషనర్ మరియు ఐదుగురు కమీషనర్లలో ఒక్క బీసీనీ కూడా నియమించక పోవడం బీసీలను అవమానపరచడమేనని అన్నారు. సమాచార శాఖ కమిషనర్లు పున సమీక్షించి బీసీలకు మూడు ఇవ్వాలని అన్నారు.

# మే 31 న టీజేఎఫ్ రజతోత్సవాలు

- అల్లం నారాయణ



**హైదరాబాద్ వెలుతురు మే 19:** తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షులు అల్లం నారాయణ చెప్పారు. 2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని అల్లం నారాయణ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అల్లం నారాయణ అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పు అల్లా టీజేఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మరోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్ల స్ రోడ్డు లోని జలవిహార్ లో ఈ నెల 31న టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని టీజేఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ అన్నారు. మే 31న జలవిహార్ లో నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లం నారాయణ, చంటి క్రాంతి కిరణ్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, ఎ. రమణ కుమార్, పి.శశికాంత్, ఎం.వి.రమణ, కోశాధికారి పి.యోగానంద్, జాయింట్ సెక్రటరి యార నవీన్ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాకేష్ రెడ్డి, సోమేశ్వర్, కోశాధికారి బాబు రావు, కళ్యాణ్ చక్రవర్తి, చిన్న పత్రికల సంగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఆగస్టీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో పారదర్శకత ముఖ్యం

తనిఖీ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే సేవల్లో ప్రజలకు పూర్తిస్థాయి సంతృప్తి ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ఇచ్చే అంశంపై పరిశీలించాలన్నారు. డేటా అనలటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. ఆర్టీసీ సేవల్లో ఇంకా మార్పులు రావాలని, నాణ్యత పెరగాలన్నారు సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకంలో ఇచ్చే మూడు సిలండర్ల సబ్సిడీ ఒకేసారి జమ చేస్తామన్నారు. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం అని సీఎం అధికారులతో అన్నారు. 'జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరగొచ్చు. ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి. దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము జత అవుతుంది. డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. రేషన్ పంపిణీ నాణ్యతపై ప్రజల సంతృప్తి పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. కొన్ని సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయిలో సంతృప్తి కనిపించాలి. ఆర్టీసీ టాయిలెట్స్, తాగునీటి నిర్వహణ విషయంలో అసంతృప్తి వస్తోంది. త్వరలో డ్వాక్రా మహిళలకు తడి చెత్త నిర్వహణ బాధ్యత, కంపోస్టు తయారీ అప్పగిస్తాం. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం' అని ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సీఎం చంద్రబాబు అన్నారు.

# అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పుష్కరాలపై లేదా?

- సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు ఏ మూలకు సరిపోతాయి?
- పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వం ఫెయిలైంది
- కుంభమేళాలో 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిథ్యమిచ్చాం
- 50 లక్షల మంది భక్తులకు ఏర్పాట్లు చేయలేకపోయారు
- బీజేపీ అధికారంలో ఉంటే పుష్కరాలను దక్షిణాది మొత్తం పండుగలా నిర్వహించే వాళ్లం
- కాళేశ్వరాన్ని అద్భుతమైన అధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- సతీసమేతంగా కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసిన కేంద్ర మంత్రి
- పుష్కర స్నానమాచరించి ముక్తేశ్వరుడిని దర్శించుకున్న బండి సంజయ్ దంపతులు





**కాళేశ్వరం వెలుతురు మే 19:** కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీపై ఉన్న శ్రద్ధ పుష్కరాల నిర్వహణపట్ల లేకుండా పోయిందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ నిధులు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. కుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు తమ ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యమిచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి సరైన ఆతిథ్యం ఇవ్వలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పుష్కరాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. సోమవారం రోజున మధ్యాహ్నం కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి బండి అపర్ణతో కలిసి కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య బండి సంజయ్ దంపతులు సరస్వతి నదీమ తల్లి పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుండి నేరుగా శ్రీకాళేశ్వర ముక్తేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. బండి సంజయ్ దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. అంతకుముందు పుష్కర ఘాట్ వద్ద, ఆ తరువాత కాళేశ్వరస్వామి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే... సరస్వతి పుష్కరాల సందర్భంగా సోమవారం రోజున కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం ఇది. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉంది. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించిన. సరస్వతి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.35 కోట్లు మాత్రమే కేటాయించింది. అధికారులు కష్టపడుతున్నప్పటికీ ఆ నిధులు ఏ మూలకు సరిపోతాయి? ఉత్తర ప్రదేశ్ లో కుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చారు. కానీ ఇక్కడ 50 లక్షల మంది దర్శించుకునే పుష్కరాలకు ఈ నిధులు ఏ మూలకు సరిపోతాయి? తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే దక్షిణాది మొత్తానికి పండుగగా నిర్వహించుకునే వాళ్లం.అందాల పోటీల నిర్వహించడానికి అభ్యంతరం లేదు. కానీ ఆధ్యాత్మిక పుష్కరాలను పట్టించుకోవడం కరెక్ట్ కాదు. ప్రభుత్వం విఫలమైంది. ఏమైనా మాట్లాడితే కేంద్రం ఏం చేస్తోందని మాట్లాడతారు. అన్నీ కేంద్రమే చేస్తే ఇక మీరున్నది ఎందుకు? కేవలం ఒక ఏరియాకే పుష్కరాలను పరిమితం చేయడం సరికాదు.. పుష్కర స్నానానికి వచ్చే భక్తులందరి కోర్కెలు తొలగిపోవాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా. కాళేశ్వరం చాలా పవర్ ఫుల్ ప్లేస్. కేసీఆర్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మనకు చాలా చెడ్డ పేరొచ్చింది. అట్లాగే గత ప్రభుత్వం కాళేశ్వరం ఆలయానికి రూ.వంద కోట్లు ఇస్తానని మొండి చేయి చూపింది. ప్రస్తుత సీఎం కూడా 200 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు. గతంలో వేములవాడకు కూడా ఇట్లనే హామీ ఇచ్చారు. కానీ ఎన్ని నిధులిచ్చారో ప్రజలందరికీ తెలుసు. ఇకనైనా ఒట్టి హామీలను పక్కనపెట్టి కాళేశ్వరంను అద్భుతమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నా.

# ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 10వేల దరఖాస్తులు

- ఈనెల 26 నుంచి 2నెలల పాటు సర్వే ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ
- రెండు రోజుల్లో మూడు గ్రామాల్లో విలేజ్ మ్యాప్‌ల డిజిటలైజేషన్ కు శ్రీకారం
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మే 19:** రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికి పెద్దసంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సోమవారం నాడు మంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలి లోని సర్వే ట్రైనింగ్ అకాడమీ ( TALIM) లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

డిజిటలైజేషన్ ఆఫ్ విలేజ్ మ్యాప్స్

టిజిఆర్ఏసి (TGRAC - తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్ చేపడుతన్నామని మంత్రిగారు తెలిపారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈడిజిటల్ మ్యాప్ లను ఎక్కడినుండైనా సులభంగా యాక్సెస్ చేయవచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా మరియు తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చన్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చన్నారు .ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ మరియు భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయవచ్చు అని వివరించారు.

# తరుగు పేరుతో రైతులకు కుచ్చుటోపి పెడుతున్న మిల్లర్లు

- మంత్రి ఆదేశాలనే విస్మరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు
- రైతులను ఇబ్బంది పెడితే సహించం
- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి వెలుతురు మే 19:** రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను సివిల్ సప్లయ్ అధికారులు విస్మరిస్తున్నారని, రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆడిషనల్ కలెక్టరును కలిసి మిల్లర్లు చేస్తున్న దోపిడిపై వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లర్ల ఆగడాలు అధికమయ్యాయని, ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు వరి ధాన్యం కొనుగోలుపై జిల్లా స్థాయి అధికారులతో జరిపిన సమీక్ష సమావేశాన్ని సైతం మిల్లర్లు బేఖాతర్ చేశారని మండిపడ్డారు. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష చేసిన తర్వాత కూడా మిల్లర్లు రైతులను తరుగు పేరుతో మోసం చేస్తున్నారంటే వారికి సివిల్ సప్లయ్ అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. చిట్యాల గ్రామానికి చెందిన మాల బాలస్వామి అనే రైతు తను పండించిన 872 బస్తాల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని, కొనుగోలు చేసినప్పుడే రైతు నుండి తరుగు పేరుతో బస్తాకు 1200 గ్రాముల చొప్పున అధికంగా తూకం చేయడం జరిగిందన్నారు. కానీ కేతేపల్లి కి చెందిన మైరూన్ అనే రైస్ మిల్లు యజమానులు రైతుకు 835 బస్తాలకే లెక్క కట్టి, 37 బస్తాలు తగ్గించి రసీదు ఇవ్వడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. శ్రీలక్ష్మి రైస్ మిల్ యజమాని కూడా ఆరేపల్లికి చెందిన మహబూబ్ అనే రైతు వద్ద క్వింటాలుకు ఐదున్నర కేజీలు అదికంగా తరుగు తీశారన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇవ్వాల్సిన ట్రక్ షీట్ ఇవ్వకుండా రైస్ మిల్లు దగ్గర ఇస్తున్నారని, ఈ విధమైన నిర్ణయాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిధంగా చాలా మిల్లర్లు నిబంధనలకు విరుద్ధంగా తరుగు తీస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి లోపాయికారిగా వత్తాసు పలుకుతున్న సివిల్ సప్లయ్ అధికారుల పైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత రెండు రోజుల క్రితం మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ జరిపిన సమీక్ష సమావేశానికి కనీస విలువ చూపని మిల్లర్లపై ఏమి చర్యలు తీసుకుంటారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్,పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోటూరి రవీందర్, ఉపాధ్యక్షుకు రేనట్ల మల్లేష్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్,రవి నాయుడు, రైతులు చిట్యాల బాలస్వామి, ఆరేపల్లి మహబూబ్, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణలో అమెరికా పాత్ర శూన్యం

***పార్లమెంటరీ కమిటీకి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరణ***

**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):** భారతదేశం–పాకిస్థాన్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం పార్లమెంటరీ కమిటీకి చెప్పారని ఓ కథనం తెలిపింది. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక స్థాయిలో తీసుకున్నారని మిస్రీ నొక్కిచెప్పారని పార్లమెంటరీ వర్గాలు తెలిపినట్లు– పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్–పాక్ వివాదాన్ని ఆపడంలో తన పాత్ర గురించి పదే పదే ప్రస్తావించారు. ట్రంప్ వాదనలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మిస్రీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కనీసం ఏడుసార్లు కాల్పుల విరమణకు దోహదపడ్డానని బహిరంగంగా చెప్పుకున్నారు. ఈ అంశంపై భారతదేశం ఎందుకు మౌనంగా ఉందని పార్లమెంట్ ప్యానెల్‌లోని ఒక సభ్యుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ట్రంప్ తన ప్రకటనలలో కశ్మీర్‌ను ప్రస్తావిస్తూనే ఉన్నారని మరో సభ్యుడు సూటిగా ప్రశ్నించారు. దీంతో భారతదేశం–పాకిస్థాన్ కాల్పుల విరమణ ద్వైపాక్షిక నిర్ణయం అని, మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొంటూ విదేశాంగ కార్యదర్శి ఈ వాదనలను తోసిపుచ్చారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ విరమణ ఒప్పందంలో అమెరికా ఎటు–వంటి పాత్ర పోషించలేదని మిస్రీ ప్యానెల్‌కు వివరణ ఇచ్చారు. ఇంకా.. భారత్– పాకిస్థాన్ మధ్య వివాదం సంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉందని, ఇస్లామాబాద్ నుంచి ఎటు–వంటి అణ్వాయుధ దాడులకు సంబంధించిన అనుమానిత సంకేతాలు లేవని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. కానీ.. పాకిస్థాన్ చైనా మూలాల సైనిక హార్డ్‌వేర్‌ను ఉపయోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన విక్రమ్ మిస్రీ.. 'వారు ఏమి ఉపయోగించినా పర్వాలేదు. మనము వారి వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాం అని చెప్పినట్లు– తెలుస్తోంది. యుద్ధ సమయంలో కోల్పోయిన భారతీయ విమానాల సంఖ్య గురించిను చెప్పేందుకు మిస్రీ నిరాకరించారు. జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ వ్యాఖ్యానించలేదు.

వెలుతురు ఎడిటోరియల్ https://epaper.velthuru.com


# సంపాదకీయం..

## ఎన్నికలకు ముందే గ్రామాలు బలపడాలి !

స్థానిక ఎన్నికలు ఇదిగో అదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు. ఇప్పటికైతే ఎప్పుడు ఎన్నికలు జరుపు తారన్న గ్యారెంటీ లేదు. తమకు పరిస్థితలు అనుకూలంగా ఉన్నాయా లేదా అన్న ధోరణిలో తెలుగు వల్లభులు లెక్కలు వేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితుల కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో మంచి మెప్పు పొందేలా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ఎవరు అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థలను బలోపేతం చేసి, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించడం లేదు. గ్రామస్థాయిలో కూడా పెత్తనం తమ చేతుల్లో ఉండేలా చూస్తున్నారు. వారు విధించే పన్నులను, పనులను వీరే చేస్తున్నారు. దీంతో గ్రామాలు ఆర్థికంగా బలపడడం లేదు. పెత్తనం తమ గుప్పిట్లో పెట్టుకుని సర్పంచ్‌లను డమ్మీలుగా గామర్చారు. గత జగన్ ప్రభుత్వం ఎపిలో సర్పంచ్‌లకు సమాంతరంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలను పెట్టారు. ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామంటున్నారు. రాజీవ్ గాంధీ స్థానిక ప్రభుత్వాల బలోపేతం కోసం తీసుకుని వచ్చిన రాజ్యాంగ సవరణలను తుంగలో తొక్కుతున్నారు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మగా ఉన్న గ్రామలను అభివృద్ధి పరచి, సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాలకురచన జరగడం లేదు. గ్రామస్థాయి నుంచి ప్రణాళిక సాగివుంటే గ్రామాలు బాగుపడి రాష్ట్రం, దేశం బగుపడేది. కానీ అలాంటి ఆలోచన కార్యరూపం దాల్చడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎంల పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామస్థాయి లో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేకపోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పక్కాగా ప్రణాళికలు జరగడం లేదు. కేంద్రం నేరుగా నిధులు ఇవ్వడం ద్వారా గ్రామాలను బలోపేతం చేయాలని కేంద్రం ఆలోచన చేసినా అందుకు పాలకులు సిద్ధంగా లేరు. వివిధ పథకాలతో చేస్తున్నపెత్తనాన్ని తగ్గించుకోవడం లేదు. గ్రామాలు చేయాల్సిన నిర్ణయాలను సచివాల స్థాయిలో తీసుకుంటున్నారు. ఎన్నికైన సర్పంచ్‌లను డమ్మీలుగా చేస్తూ..వారికి నిధులు కేటాయించకుండా..వారిని పనిచేయనీయ కుండా పెత్తనం చెలాయిస్తున్న తీరు వల్ల గ్రామాల సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాలకు ఏమి అవసరమన్నది గుర్తించి నిధులు విడుదలచేసి, అమలు చేయించేలా కార్యాక్రమాలు సాగివుంటే ఆర్థికవ్యవస్థ ఎప్పుడో బలోపేతం అయ్యేది. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్దం చేయాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. గ్రామాలను పటిష్ట పాలనా కేంద్రలుగా తీర్చి దిద్దాలి. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ఉద్యోగులను పనిచేసేలా చేయాలి. అలాగే పనులకు సంబంధించి గ్రామాల్లో తీర్మానం చేయించి అమలు చేయించాలి. సిఎం స్థాయిలో కేవలం పర్యవేక్షణ మాత్రమే ఉండాలి. కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా అవసరమైతే ప్రణాళికలను అమలు చేయాలి. అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి. గ్రామాలను యూనిట్‌గా కార్యక్రమాల రచన సాగాలి. సర్పంచ్‌లను, గ్రామ వార్డు సభ్యులను బాధ్యులను చేయాలి. అప్పుడే ఏ పథకం అయినా ఆశించన ఫలితం సాధిస్తుంది. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగతమైన శ్రద్దకు సంబంధించినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ధ తక్కువనే చెప్పాలి. ఇప్పటికీ ఆరుబయట మల విసర్జన అన్నది అలవాటుగా కొనసాగుతోంది. నిత్యం టీవీల్లో పత్రికల్లో ప్రకటనల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్నా వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల కు 12వేల ఆర్థిక సాయం అందిస్తున్నా గ్రామాల్లో ప్రజలు వెంటనే మరుగదొడ్లు నిర్మించు కునేందుకు ముందుకు రావడం లేదు. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామాలను యూనిట్‌గా చేసి సర్పంచ్‌లకు బాధ్యత అప్పగించి ఉంటే ఇది వందశాతం సక్సెస్ అయ్యి ఉండేది. కానీ గ్రామస్థాయిలో పనులకు సర్పంచ్ లను బాధ్యులను చేయక పోవడం వల్ల కార్యక్రమాలు విజయవంతం కావడం లేదు. గ్రామస్థాయిలో పని ఏదైనా సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా అమలు చేయాల్సి ఉంది. ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. దీంతో వ్యవస్థ బలోపేతం అవుతుంది. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. మురుగుకాల్వల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు లేనందున దుర్వాసన వెదజల్లు తుండటంతో పల్లె ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రహదారుల్లోనే మురుగు నీరు ప్రవహిస్తుండటం దోమల బెడద తీవ్రం కావడంతో రోగాల బారిన పడుతున్నారు. అనేక అంటురోగాలు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగ్యూ విజృంభిస్తోంది. సర్పంచ్‌లు ఉన్నా లేకున్నా ఈ పనులను పెద్దగా పట్టించుకోవడంలేదు. ఇలాంటి సమస్యలనే ఇప్పుడు అధ్యయనం చేయాలి. గ్రామాలను బలోపేతం చేయాలి. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయారయ్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. సర్పంచ్‌లను,పంచాయితీల పాలకవర్గాలను విశ్వాసంలోకి తీసుకుని వారిని బాధ్యులను చేసినప్పుడే గ్రామాల రూపురేఖలు మారగలవు.సర్పంచ్‌లకు పూర్తిస్థాయి అధకారాలను దఖలు పరచాలి. నిధులు సకాలంలో విడుదల చేయాలి. అప్పుడే గ్రామాలు బలపడతాయి. ఎన్నికలకు ముందే ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలి.

# పంచాయితీలను ఆర్థికంగా ఆదుకోవాలి

- **సర్పంచ్‌ల బాధ్యతలను పెంచాలి**
- **గ్రామస్థాయిలో ఉపాధి పనులను జోడించాలి**

**హైదరాబాద్,మే19( వెలుతురు):**

పంచాయితీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కులవృత్తులను,గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొదిస్తే తప్ప మార్పు కానరాదని పలువురు ప్రముఖులు చెబుతున్నారు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని అంటున్నారు. గ్రామాలను యూనిట్‌గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. పల్లెల్లో ఏ పనులు చేయాలో సిఎం స్థాయిలో అధికారుల పర్యవేక్షణలోనే సాగుతోంది. గ్రామాల్లో సర్పంచ్‌ల బాధ్యత నామమాత్రంగా ఉంటోంది. వారికి బాధ్యత అప్పగిస్తే పన్నుల వసూళ్ల మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించిన ప్రభుత్వం నిధుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాల్లో పన్నులు ఇతరత్రా రూపంలో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదు. గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగితే తప్ప నిధులు సమకూరవు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీలో పారిశుధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. ఎన్నికలకు ముందే ఇవన్నీ నిర్ధారించాలి. తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇందుకు పూనుకోవాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతాయి. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలి.





గ్రామాల నిధులు గ్రామాలకే చెందేలా చేయాలి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించేలా చేస్తే నిధుల దుర్వినియోగం తప్పుతుంది. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది.

వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్ధ్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేస్తే పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించుకోవాల్సిన అసవరం ఉంది. ఇలాచేస్తే కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏ పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి ఊరట కలుగనుంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని పలువురు రాజకీయ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. దీనివల్ల పల్లెలు పరిశుభ్రంగా మారతాయి. పంచాయతీలకు ఆర్థికభారం తప్పుతుంది.గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

# వ్యక్తిగత మరుగుదొడ్లపై నిర్లక్ష్యం

- **ప్రజల్లో కానరాని చైతన్యం**

**విజయనగరం,మే19( వెలుతురు):**



దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరగుదొడ్ల నిర్మాణం కోసం ప్రచారం ఉధృతం చేసినా ఆశించన లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనికి తోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబందించినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి ఏళ్లు గడిచాయి. గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. ఏపీలో ఇప్పటికే లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం. ప్రజల్లో నిర్లిప్తత తొలగాలి. పరిశుభ్రత పాటించకపోతే వ్యక్తిగతంగా తమకు, తద్వారా సమాజానికి చేటు జరగుతుందన్న విషయం ప్రచారం చేయాలి. ప్రజలను నిరంతర చైతన్యం చేయడం ద్వారానే సంపూర్ణ స్వచ్ఛత సాధించగలమని గుర్తించాలి.

# అభివృద్ధి దిశగా తెలంగాణ పథకాలు



**కరీంనగర్,మే19( వెలుతురు):**

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో బృహత్తరమైన పథకాలు ప్రవేశపెట్టి ఏ ప్రభుత్వమూ ఎన్నడూ చేయని అభివృద్ధిని సిఎం రేవంత్ రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాల్లో దళితులకు పెద్దపీట వేస్తూ వారికి సహకారం అందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం అమలు చేయబోతున్నారని గుర్తుచేశారు. ఇకపోతే ధాన్యం కొనుగోళ్లకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని వెల్లడించారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## మిర్చి రైతులకు స్టోరేజీలను ఇవ్వాలి

**గుంటూరు,మే19( వెలుతురు):**

మిర్చి రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గిపోతుందని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుందామంటే వాటి యజమానులు కూడా ఇష్టారాజ్యంగా అద్దెలు పెంచారని జిల్లా రైతు సంఘం నాయకులు విమర్శించారు. అక్రమంగా వసూళ్లు చేస్తున్నా అధికారులు, పాలక వర్గం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధిక కమీషన్, మచ్చుల పేరుతో మిర్చియార్డులో అధిక వసూళ్ల దోపిడీని అరికట్టాలని అన్నారు. ఇప్పటినుంచే చర్యలు తీసుకుని వచ్చే మార్కెట్ నాటికి పక్కా ప్రణాళిక అమలు చేయాలన్నారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సన్న, చిన్నకారు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, మార్క్‌ఫెడ్‌కు వేయి కోట్లు కేటాయించి కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నారు. అలాగే కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు రూ.50 వేలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

# పల్లె ప్రగతికి బిఆర్ఎస్ ప్రత్యేక కృషి

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి వెల్లడి**

**జనగామ,మే19( వెలుతురు):**


పల్లె పట్టణ ప్రగతి కార్యాక్రమాలను ఉమ్మడి వరంగల్ జిల్లాలో పటిష్టంగా నిర్వహించామని, కానీ ప్రస్తుం గ్ఆమాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక కార్యక్రమాలు విజయం సాధించాయి. గ్రామాలను పచ్చగా,పరిశుభ్రంగా నిలిపేందుకు అధికారులు కృషి చేసారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఆశయానికి అడుగులు పడ్డాయి. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి సర్పంచ్‌లను పురమాయించడంతో గ్రామాల అభివృద్ధిపై ప్రజలు దృష్టి సారించారు. గ్రామంలో గ్రామ పారిశుద్ధ్య కమిటీని ఏర్పాటు చేశాం. అందులో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎన్నికల హామీలో లేని అనేక సంక్షేమ పథకాలు, అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎర్రబెల్లి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం విస్మరించిందని, 24గంటల ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఎర్రబెల్లి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సమైక్య రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రైతుల కళ్లలో వెలుగులు చూడాలన్న లక్ష్యంతో కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడితే కరంటు కష్టాలు ఏర్పడుతాయన్న ఆంధ్ర పాలకుల విమర్శలకు దీటుగా 24గంటల ఉచిత కరంటు ఇచ్చి చూపారని అన్నారు. రైతాంగానికి కరంటు సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ సబ్‌స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

( ఆధ్యాత్మిక చింతన )

# మంచిని పెంచుకోవాలి !

**తిరుమల,మే19( వెలుతురు):**

సర్వ ప్రాణికోటికీ నేను మిత్రుణ్ని అని తెలిసినవాడు శాంతి పొందుతాడని శ్రీకృష్ణ ఉవాచ. ' ఎందుకంటే ఈ భూమండలం మీదున్న ప్రాణకోటితోనే మన జీవనం పెనవేసుకుని ఉంది.అలాగా తోటివారిని గౌరవిస్తూ వారితో కలసిమెలసి బతకడం నేర్చుకోవాలి. నాకు వారంతా తెలుసు' అనే అహంభావం కాదు, 'వారందరికీ నేను తెలుసు' అనుకోవడంలోఎంతో సంతోషం ఉంటుంది. నిస్వార్థమైన ప్రేమ గల హృదయ కవాటాలు ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయి. అసంఖ్యాక మిత్రుల్ని అవి ఆహ్వానిస్తాయి. నాలుగు మంచి మాటల వల్ల పోయేదేముంది- అహం తప్ప! బాధాతప్త హృదయానికి ఊరట కలిగించేది స్నేహస్పర్శ ఒక్కటే. అది ఆర్ద్రమైన సానుభూతికి స్పష్టమైన సంకేతం. అటువంటి విజయం సాధించినవారికి- ఒక్క అభినందన, మెచ్చుకోలు నిరంతర విజయ పరంపర కలిగిస్తాయి. సమస్తమూ శుభంగా సుఖంగా ఉండాలన్న అభిలాషను మన సనాతన ధర్మం ప్రస్ఫుటం చేస్తుంది. నలుదిశలా జ్ఞానకాంతులు ప్రసరించినప్పుడు, మనిషిలో ఆ తేజం ప్రతిఫలిస్తుంది.



అటువంటి వికాసాన్నే అతడు ఆహ్వానించాలి. సానుకూల దృక్పథాన్ని అలవరచుకుంటే- మనసులో స్వార్థానికి, ద్వేషానికి తావు ఉండదు. కాలం ఇచ్చే అవకాశాల్ని అందిపుచ్చుకోవాలే తప్ప, సాటివారివి దోచుకోకూడదు. అదే విశ్వహిత కాంక్ష!శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన గిరిని తన చిటికెన వేలితో ఎత్తి పట్టుకున్నప్పుడు, అక్కడి జనమంతా నిశ్చింతగా ఆ పర్వతం కిందకు వెళ్లి తలదాచుకున్నారు. అది తమమీద పడుతుందని అనుమానించినవారు బయటే ఉండిపోయి, ఇంద్రుడు సృష్టించిన రాళ్లవాన బారినపడ్డారు. కృష్ణభక్తులకు నమ్మకమే శ్రీరామరక్ష అయింది. విశ్వాసాన్ని మనిషి ఇతరుల నుంచి సాధించుకోగలగాలి.

## గుల్జారీ హౌజ్ అగ్ని ప్రమాదం అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందలేదనేది అవాస్తవం

- సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ల చేత 108 అంబులెన్స్ వాహనాల ఆకస్మిక తనిఖీలు
- సమాచారం లోపంతో ఇలా మాట్లాడటము సరికాదు
- ప్రమాద సమయంలో ఇలాంటి రాజకీయ ప్రకటనలతో రెస్క్యూటీం స్థైర్యాన్ని దెబ్బతీయద్దు
- ప్రజలను గందరగోల పరచవద్దని కోరుతున్నాము
- హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్





**హైదరాబాద్ వెలుతురు మే 19:**
మే 18న గుల్జర్ హౌస్ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్సు రాక బాధితులకు ఆక్సిజన్ అందలేదనే కొంత మంది చేస్తున్న వ్యాఖ్యలను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. మే 18న గుల్జర్ హౌస్ లో అగ్ని ప్రమాదమునకు గురైన 15 మంది బాధితులను 7అంబులెన్సులు108 వాహనములలో సమీప ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తక్షణమే తరలించి ఆక్సిజన్ అందిస్తూ సహాయక చర్యలు అందించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఈ ప్రమాద సమాచారమును 108 జిల్లా కోఆర్డినేటర్ భూమా నాగేందర్ కు తెలియజేయడం జరిగిందన్నారు. ప్రమాదమునకు సంబంధించిన సమాచారము ఉదయం 6.17 నిమిషాలకు 108 కాల్ సెంటర్ కు అందిన వెంటనే గోషామహల్ 108 అంబులెన్స్ ts 08 ul 5682 వాహనము సిబ్బందితో ఉదయం 6.25 నిమిషాలకు(8 నిమిషాలలో) ప్రమాద స్థలమునకు చేరి సహాయ చర్యలు అందించామని తెలిపారు.. తదుపరి అగ్ని ప్రమాద తీవ్రతను గుర్తించి తిరిగి (06) 108 అంబులెన్స్ వాహనంములు tg 09ub 9280, tg 08 t 8252,tg 08t 7933,tg 08t 7274, tg 08T 8202,TG 08T 8113 అగ్ని ప్రమాద స్థలానికి వెంటనే చేరుకుని సహాయ చర్యలు అందించిచేయని అన్నారు. సోమవారం రోజున జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ లో మేరకు ముగ్గురు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు నేడు మే 19న ఏడు108 అంబులెన్స్ వాహనములను ఆకస్మికంగా పరిశీలించగా అందులో అవసరమైన ఆక్సిజన్ వసతులు, నిలువలు ఉన్నట్లు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు ధ్రువీకరించినట్లు తెలిపారు.

## తెలంగాణ ప్రాంత క్రీడాభారతి నూతన కమిటీ అధ్యక్షులు డి సతీష్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 19:**
బర్కత్ పుర లోని తెలంగాణ ప్రాంత క్రీడాభారతి నూతన కమిటీ ప్రకటన చేయడం జరిగింది దిని లో భాగంగా అఖిల భారతీయ సంఘటన మంత్రి మానేనియా ప్రసాద్ మహంకార అలాగే ప్రాంత కార్యవహ్ ఎర్ర నర్సింగ్, ప్రాంత ప్రచారక్ శ్రీధర్ పాల్గొని తెలంగాణ ప్రాంత క్రీడాభారతి కమిటీ ని ప్రకటన చేయటం జరిగింది క్రీడాభారతి యొక్క ముఖ్య ఉద్యేశం 6సంవత్సరాల బాల బాలికలు నుండి మొదలు కొని 90 ఎల్లా వయసు ఉన్న కూడా వరకు ఎదో ఒక ఆట ఆడటం వలన వాళ్లు మానసిక ఉల్లాసం చెందుతారు, దీనివల్ల మానసిక ఉల్లాసంగా చెబుతారు, దూరం అవుతాయి, అర్హులైన క్రీడాకారులకు క్రీడా కేంద్రం తరఫున మంచి శిక్షణ ఇచ్చి నేషనల్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడించటం చాలా క్రీడల్లో అనేకసార్లు డూఫింగ్ అని లంచాలు తీసుకున్నారని లంచం తీసుకొని అర్హులైన వారిని కాకుండా వేరే వారిని ఆడించడం వలన అర్హులైన వ్యక్తి ఆర్థిక స్తోమత లేక వెనుకబడి పోతున్నారు, అలాంటి వారికి క్రీడాభారతి తరపున ప్రోత్సాహాన్ని అందిస్తూ ఆర్థిక సహాయాన్ని చేస్తూ ముందుకు తీసుకెళుతున్నాం, ఇవే కాకుండా దివ్యాంగులకు కూడా ఏదో ఒక ఆటలు ప్రావీణ్యం పొందేటట్టు చేయటం దేశంలో ఉన్నటువంటి క్రీడలను ప్రోత్సహించడం క్రీడలలో అనేక రకాలైన అసోసియేషన్స్ ఉంటాయి వాటి అన్నిటిని కూడా ఒక్క తాటిపైన తీసుకొచ్చి దేశం యొక్క ఔన్నత్యాన్ని దేశం యొక్క గౌరవాన్ని ప్రపంచ దేశాల్లో చూపించడమే క్రీడా భారతీయ యొక్క ముఖ్య ఉద్దేశం నూతన మిటీ సభ్యులు, అధ్యక్షులు డి సతీష్ గౌడ్, కార్యదర్శి, హనుమంతు, ట్రెజరర్, నరేందర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు,

## జిల్లా కలెక్టర్ చౌటుప్పల్ పిఏసిఎస్, ఏఎంసి సెంటర్లను ఆకస్మిక తనిఖీ

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 19 :**



PACS చౌటుప్పల్ PPC సెంటర్లు నేలపట్ల మరియు AMC చౌటుప్పల సెంటర్లను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం రోజు సందర్శించారు. ఈ యొక్క కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. సంఘ అధ్యక్షులు చింతల దామోదర్ రెడ్డి కొనుగోలు కేంద్రాలలో ఉన్న పలు సమస్యలు జిల్లా కలెక్టర్ కి తెలియజేశారు. ముఖ్యంగా రవాణా సమస్య ఎక్కువగా ఉన్నదని రైస్ మిల్లుల దగ్గర దిగుమతి రెండు నుంచి మూడు రోజులు పడుచున్నదని తెలిపారు. దానికి జిల్లా కలెక్టర్ %ణ.ా.ా% కు ఫోన్ ద్వారా రైస్ మిల్లర్ల దగ్గర దిగుమతి గురించి అడిగగా, మిల్లర్ పూసల గోదాం తీసుకున్నారు, 50 మంది అమాలీలు కూడా ఉన్నారు రేపటి నుండి దిగుమతి త్వరగా జరుగుతుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, ఏఈఓ శంకరయ్య, గిర్కంటి నిరంజన్ గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, చిన్నం బాలరాజు, సంఘ సెక్రటరీ వై.రమేష్ రైతులు పాల్గొన్నారు.

## చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం



**వెలుతురు నారాయణఖేడ్ మే 19 .**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వెంకటాపూర్ చౌరస్తా లో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం మహాహారతి నిర్వహించగా మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన కార్యక్రమాలు కొనసాగించారు. కాగా ప్రతి సోమవారం భక్త మార్కండే ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు పద్మశాలి కుల బాంధవుల ఆధ్వర్యంలో, భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమం అనంతరం పద్మశాలి సంఘం నారాయణఖేడ్ శ్రీ భక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమం చేపట్టారు.

భక్త మార్కండేయ ఆలయంకు హుండీ విరాళం...
నారాయణఖేడ్ మండల పరిధిలోని అబ్బెంద గ్రామానికి చెందిన బాయిని సుశీల నాగన్న కుటుంబ సభ్యులు భక్త మార్కండేయ ఆలయంకు హుండీని విరాళంగా ఇచ్చారు. సత్తేగామ గ్రామానికి చెందిన భవాని టెంట్ హౌస్ భోగ గణేష్ 50 స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా మెమొంటోతో ఘనంగా సన్మానించారు.

## నిస్వార్థ రాజకీయాలకు చుక్కాని సుందరయ్య

- తన జీవితమంతా పోరాటమే
- సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం
- శోభనద్రిపురంలో సుందరయ్య వర్ధంతి

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**



భారత రాజకీయాలకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయాకమని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శోభనాద్రిపురం గ్రామంలో నాయకులతో కలిసి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజలకు అంకితమిచ్చిన మచ్చ లేని కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య అన్నారు. చిన్న తనంలోనే స్వతంత్రోద్యమంలో పనిచేసి తెలంగాణా రైతంగ పోరాటానికి నాయకత్వం వహించి దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాడన్నారు. ఉత్తమ పార్లమెంటీరియన్ గా దేశంలో కీలకమైన చట్టాలు చేయడంలో సుందరయ్య పాత్ర కీలకమైనదని అన్నారు. వ్యవసాయ కార్మికులకు సంఘం ఏర్పాటు చేసి కూలీ పెంచాలని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని పోరాడు. పేరులో కులం తోకని కత్తిరించుకొని కుల అసమానతలకు వ్యతిరేకంగా కింది వర్గాల ప్రజల్ని చైతన్యం చేశాడన్నారు. పేదల పక్షాన పోరాడటమే సుందరయ్యకు మనమిచ్చే ఘన నివాళిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్,మాజీ ఉప సర్పంచ్ ఎండీ రషీద్, బోడిగే రజిత,శాఖ కార్యదర్శి గోగు లింగస్వామి, కొమ్ము అంజయ్య, ఎర్ర సాయులు, బోడిగే సుదర్శన్,లతీఫ్, భీంపాక ప్రశాంత్,జంగిలి కుమార్, ఇర్వి రవిజ్యోతి, ఎర్ర చైతన్య,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పేద యువతి పెళ్లికి పుస్తె మట్టెలు

*అందజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కందిమల్ల గోపాల్ రెడ్డి*



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**
మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నిరుపేద యువతి పెళ్లికి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కందిమల్ల గోపాల్ రెడ్డి ఆర్థికంగా సాయం చేసి దాతృత్వం చాటుకున్నాడు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు నోముల కృష్ణ చెల్లెలు పుష్పలత అనే యువతికి పెళ్లి నిశ్చయమైంది. నిరుపేద కావడంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కందిమల్ల గోపాల్ రెడ్డి సహాయం చేసేందుకు ముందుకొచ్చాడు. సాయిరామ ఫంక్షన్ హాల్ రామన్నపేట లో జరిగిన వివాహంలో పాల్గొని పెళ్లి కుమార్తె పుష్పలత కు పుస్తే మెట్టెలు, పెళ్లి చీరను అందజేశారు. నిరుపేద కుటుంబానికి సహాయం చేసిన కందిమల్ల గోపాల్ రెడ్డి ని పెళ్లి కుమార్తె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల శివ,నోముల స్వామి, చిప్పలపల్లి స్వామి, నోముల శివ,చిప్పలపల్లి ఉపేందర్,సుర్వి శివ, నోముల శంకర్,నోముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ హస్తకళలు అద్భుతం

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గానేత్ విన్ ఓవెన్

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 19 :**



భారతీయ హస్తకళలు అద్భుతమైన వని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గానేత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. చౌటుప్పల్ మండలం, గ్రామం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మిమీ క్రాఫ్ట్ హస్తకళల కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. అక్కడ గిరిజన కళతో తయారుచేసిన అలంకరణ వస్తువులను పరిశీలించారు. ప్రాచీనమైన బాతిక్ పద్ధతిలో వస్త్రాలకు మైనాన్ని పూసి వివిధ రకాల ఆకృతులతో రంగులు అది ఫ్యాషన్ వస్త్రాలు తయారుచేసే పద్ధతిని తిలకించారు. భారతీయులు పూర్వకాలం నాటి పద్ధతిలో పత్తితో నేసిన నూలుపై టై అండ్ డై, స్క్రీన్, బ్లాక్ ప్రింటింగ్ చేసి చీరలు, డ్రెస్ మెటీరియల్ తయారు చేస్తున్న హస్త కళాకారుల పనితనాన్ని పరిశీలించారు. తాను స్వయంగా బ్లాక్ ను చేత పట్టుకొని రంగులో ముంచి వస్త్రంపై ప్రింటింగ్ చేసి భారతీయ హస్తకళలపై తన అభిమానాన్ని చాటుకున్నారు. హస్త కళాకారులను, ప్రాచీన హస్తకళలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్న కృష్ణమూర్తి, పుష్పలత లను ఆయన అభినందించారు. భారతీయ హస్తకళల గురించి తనకు పరిచయం చేసినందుకు హర్షం వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా మిమి క్రాఫ్ట్ నిర్వాహకుడు, ఫ్యాషన్ డిజైనర్ కే. కృష్ణమూర్తి మాట్లాడుతూ, భారతీయ హస్త కళలు ఎంతో ప్రాచీనమైనవని, విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. యాంత్రికరణ, పారిశ్రామికీకరణ పెరిగినా కూడా ఈ భారతీయ హస్త కలలకు గౌరవం పెంచేందుకు, ఇవి అంతరించిపోకుండా కాపాడేందుకు ప్రాచీనతకు, ఆధునికతను జోడించి తన వంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మిమీ క్రాఫ్ట్ నిర్వాహకురాలు పుష్పలత బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ను హస్తకళ శాలువాతో సన్మానించారు .

## నూతన వధూవరులకు చిలువేరు సమ్మి గౌడ్ ఆశీర్వాదం



**కేసముద్రం వెలుతురు మే 19:**
కేసముద్రం మున్సిపాలిటీ కేసముద్రం పట్టణానికి చెందిన రాపోలు శైలజ- రమేష్ దంపతుల కుమార్తె సుష్మ శ్రీ వివాహం పెళ్లి కుమారుడు మహేష్ తో ఆదివారం హరిహర గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వివాహ మహోత్సవ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమయ గౌడ్ హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు సిపిఎం జిల్లా నాయకులు మార్తినేని పాపారావు,చాగంటి కిషన్,ఎర్రం శెట్టి అశోక్ మునికుంట్ల కన్నయ్య తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## పాఠశాల విద్యాశాఖ రంగారెడ్డి జిల్లా తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం






**శంకర్ పల్లి వెలుతురు మే 19**
గత 15 రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరాన్ని శంకర్పల్లి మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ సందర్శించడం జరిగింది. వారు ఈ సందర్భంగా శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి కార్యక్రమాన్ని మన శంకర్పల్లి మండలంలో విజయవంతంగా కొనసాగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి, చిత్రలేఖనము, యోగ-ధ్యానం, డ్రాయింగ్, పెయింటింగ్, చేతివ్రాత, క్రీడలు వంటి పలు అంశాల్లో తర్ఫీదు నివ్వడం జరిగిందని తెలిపారు. మరి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల వైపు గ్రామంలోని పిల్లలందరినీ మల్లించి పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచడానికి ఈ సమ్మర్ క్యాంపు ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోకిల తాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాములు, ఉపాధ్యాయులు కే శివకుమార్ మండల సీనియర్ ఉపాధ్యాయులు పి ఆశీర్వాదం గ్రామ యువకులు మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులందరికీ ప్రింటెడ్ కాపీ రైటింగ్ కు సంబంధించినటువంటి తెలుగు, ఆంగ్లంనకు సంబంధించినటు వంటి నోటు పుస్తకాలను అందజేయడం జరిగింది. నేటితో ఈ శిక్షణ శిబిరం ముగిసిందని తెలిపారు.

## బిజెపి మండల నూతన కమిటీ ఎన్నిక



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 19 :**
మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మండల నూతన కమిటీ ప్రకటించడం జరిగింది అందులో ఉపాధ్యక్షులు - నాటి మల్లేశం గౌడ్, పొట్ట బత్తిని బాలరత్నం, ఊదరి దివ్య, పులిగిల్ల శ్రీనివాస్ చారి, పర్నే శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి - పబ్బతి శేఖర్ గౌడ్, యాస అశోక్ రెడ్డి, కార్యదర్శులుగా - బర్మా నాగరాణి, చింతల ఎల్లేష్ యాదవ్, పగిళ్ల నాగిరెడ్డి, కొలను జనార్ధన్ రెడ్డి, బాలగోని లింగస్వామి యాదవ్, కోశాధికారి - ఎరుకల కల్పన, కార్యవర్గ సభ్యులు - వనం సత్యనారాయణ, తోకల మహేందర్రెడ్డి, కోయడ స్వామి గౌడ్, ఆకారపు శివ, బద్దం రవీందర్, బోయ అంజలి, తాటి అశ్విని, కంచర్ల పవిత్ర, ఫకీరు పారిజాత పనసగుని గీత లను ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్ ప్రకటించడం జరిగింది ఈ కార్యక్రమంలో బత్తుల జంగయ్య గౌడ్, చినుకాని మల్లేష్ యాదవ్, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉడుగు యాదయ్య గౌడ్, భాతరాజు సత్యం, కట్ట కృష్ణ, అల్మాస్ పేట గౌతమ్, పబ్బు వంశీ గౌడ్, మన్నే జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుంగ గోవర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**
సిరిపురం గ్రామంలో ఇటీవల అకాల మరణం పొందిన తుంగ గోవర్ధన్ కుటుంబానికి రామన్నపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ పిఎసిఎస్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 60,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఉపేంద్రా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆ కుటుంబానికి నిరంతరం అందుబాటులో, ఉండి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిరుపేద కుటుంబమైన తుంగ గోవర్ధన్ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆర్థిక సహాయం అందించినవారు బండ శ్రీనివాస్ రెడ్డి, కూనూరు ముత్తయ్య, ఏళ్ల శ్రీనివాస్ రెడ్డి, కట్ట నరసింహారెడ్డి, దంతూరి రామయ్య, బెల్లంకొండ అండాలు, కట్ట సతీష్ రెడ్డి, కట్ట అంజిరెడ్డి, కూనూరు రమేష్ తదితరులున్నారు .

## మాజీ ఎంపిటిసి తిమ్మాపురం మహేందర్ రెడ్డి తండ్రి మృతి

*నివాళులర్పించిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు*

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**



వెల్లంకి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి తండ్రి తిమ్మాపురం నారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాగా సిపిఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి,సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మాజీ సర్పంచ్ కూరెళ్ళ నర్సింహా చారి,శాఖ కార్యదర్శి ఆవనగంటి నగేష్, తాటిపాముల శ్రీశైలం,అంబటి సురేందర్ రెడ్డి, ఆవనగంటి స్వామి, తాటిపాముల మహేష్, కన్నీబోయిన రాజలింగం, రాపోలు ప్రభాకర్, కుమార్,తాటిపాముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్ మున్సిపాలిటీ MIG కమ్యూనిటీ హాల్ లో వేసవి శిబిరం విజయవంతం.

## శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించి సర్టిఫికేట్ మరియు బహుమతులు అందజేసిన "కాట దంపతులు"





**తెల్లాపూర్ వెలుతురు మే 19:**
తెల్లాపూర్ మునిసిపాలిటీలోని MIG కమ్యూనిటీ హాల్ లో మాజీ కౌన్సిలర్ శ్రీమతి పావని రవీందర్ గారి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి మహిళ చైతన్య సంఘం ద్వారా ఒక నెలపాటు మహిళలు మరియు పిల్లల కోసం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ, మగ్గం వర్క్, స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్, జుంబా డాన్స్ మరియు యోగా వంటి అనేక ప్రయోజనకరమైన కోర్సులు అందించబడ్డాయి. అదేవిధంగా పిల్లల కోసం క్లాసికల్ మరియు వెస్టర్న్ డాన్స్, సంగీతం, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్, యోగా, ధ్యానం, నగల తయారీ, మట్టి పనులు, వినాయక విగ్రహాల తయారీ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వబడింది. ఇందులో ఒక ప్రత్యేక ఆకర్షణగా Ms లుమా ఫ్యాషన్ షో కూడా నిర్వహించబడింది, ఇందులో పాల్గొన్న పిల్లలు తమ ప్రతిభను సమర్థంగా ప్రదర్శించారు. ఒక నెలపాటు కొనసాగిన ఈ శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు మరియు బహుమతులను అందజేసే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మరియు వారి సతీమణి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శిక్షణార్థులకు అభినందనలు తెలియజేసి, శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ, తమ నేర్పును భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు.





# మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి తండ్రి మృతి

### పూలమాల వేసి సంతాపం తెలియజేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**
మండలం వెల్లంకి గ్రామంలోని మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, తండ్రి తిమ్మాపురం నారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి ,కాంగ్రెస్ పార్టి నాయకులు గంగుల రాజిరెడ్డి , జినుకల ప్రభాకర్ ,పూస బాల కిషన్ ,బత్తుల కృష్ణ గౌడ్, రచ్చ లక్ష్మణ్ గుప్త నర్సిరెడ్డి ఎండి రేహాన్ జెల్లా వెంకటేశం ఎండి అక్రమ్, జమీరుద్దీన్, కోటా సుధాకర్ కొమ్ము శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 19**
తుమ్మలగూడం 33/11 కె.వి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా నేడు మంగళవారం ఉదయం 6:00 నుండి ఉదయం 9 గంటల వరకు తుమ్మలగూడెం ,భోగారం, సిరిపురం,గ్రామాలకు,మరియు హెచ్పిసిఎల్ కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించగలరని రామన్నపేట విద్యుత్ శాఖ ఏఈ ఎం. కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.



సోమవారం రోజున ఖైరతాబాద్ శాసనసభ్యులు గౌరవనీయులు దానం నాగేందర్ గారి ఆదేశాల మేరకు కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు, మరియు సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్ 28 కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించడం జరిగింది.

**హైదరాబాద్ వెలుతురు మే 19:**

# "హిందూ ఏక్తా యాత్ర" పాటలు విడుదల

- తిరంగా ర్యాలీలో 2 సాంగ్స్ ను రిలీజ్ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్...
- హిందుత్వ వాదులు, బీజేపీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్న సాంగ్స్...



**కరీంనగర్ వెలుతురు మే 19:**
ఈనెల 22న కరీంనగర్ లో కనీవినీ ఎరగని రీతిలో "హిందూ ఏక్తా యాత్ర" నిర్వహించేందుకు సిద్ధమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందులో భాగంగా సోమవారం రోజున సాయంత్రం తిరంగా ర్యాలీ ముగింపు సందర్భంగా 2 పాటలను రిలీజ్ చేశారు. ఆకుల నాగేశ్వరరావు రచనా సారథ్యంలో సింగర్లు లక్ష్మీ, రాజేందర్ పాటలను ఆలపించగా మేకల భరత్ సంగీతం సారథ్యంలో డీజే లింగా సమకూర్చారు.
రెండు పాటల్లో ఒకటి "గడప లోపలే మన కులం.... గడప దాటితే హిందువులం" అంటూ లక్ష్మీ పాడగా, "మానేరు మట్టిలో పుట్టినోళ్లం...హిందుత్వమే ప్రాణంగా బతికేటోళ్లం" అంటూ సింగర్ రాజేందర్ పాడిన పాట అందరినీ ఉర్రూతలూగించింది. ముఖ్యంగా హిందుత్వ వాదులను, కార్యకర్తల్లో జోష్ నెలకొంది. ఆ పాటలకు కార్యకర్తలు డ్యాన్సులు వేయడం కన్పించింది.

# బిజెపి నాయకులను అరెస్టు చేయడం హేమమైన చర్య

### బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరి జానకి ,ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు






**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ మే 19:**
నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఇందిరా గిరి జల వికాస్ పథకం ప్రారంభానికి వస్తున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం హేమమైన చర్య అని నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరి జానకి ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. భారతీయ జనతా పార్టీ నల్లమల్ల ప్రాంత సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలియజేయడానికి వెళుతున్న భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడం బాధాకరమని అమరాబాదు మండలంలో చెన్నకేశవ ప్రాజెక్టు , పాలిటెక్నిక్ కాలేజ్ ,ఏకలవ్య విద్యాలయం నల్లమల్ల ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ మండల అధ్యక్షుడు గోలి రాజు బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల పరమేష్ నోముల శంకర్ గౌడ్ నోముల రమేష్ గౌడ్ సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కోవిడ్ కలకలం

- నటి శిల్పా శిరోద్కర్‌కు పాజిటివ్

**ముంబై,మే19( వెలుతురు):**
కొత్తగా మరోమారు కోవిడ్ విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో తాజాగా కోవిడ్ ఆందోళన కలిగిస్తోంది. తాను కొవిడ్ బారిన పడినట్టు బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. శిల్ప త్వరగా కోలుకోవాలని పలువురు అభిమానులు, నెటిజన్లు కామెంట్లు- పెడుతున్నారు. 'కొవిడ్ జర్నీ మళ్లీ మొదలైందా?' అంటూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. సింగపూర్, హాంకాంగ్, థాయ్‌లాండ్..తదితర దేశాల్లో ఇటీ-వల కొవిడ్ కొత్త కేసులు ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ సోదరి శిల్పా శిరోద్కర్. ఈ బాలీవుడ్ నటి 'బ్రహ్మ' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. పలు హిందీ సీరియళ్లలో కీలక పాత్రలు పోషించిన ఆమె 'బిగ్‌బాస్ 18' (హిందీ) కంటెస్టెంట్‌గా అందరికీ పరిచయం. ఇదిలావుంటే క్రికెటలర్ ట్రావిస్ హెడ్ కూడా కోవిడ్ బారిన పడ్డట్లు వార్తలు వస్తున్నాయి.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- అనంత చంద్రశేఖర్ గౌడ్



**నల్గొండ జిల్లా బ్యూరో చండూర్ మే 19 (వెలుతురు):**
సోమవారం శాసనసభ్యులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 5 మంది లబ్దిదారులకు 2,01,500 వచ్చిన చెక్కులను ఈరోజు లబ్ధిరులకు గెస్ట్ హౌస్ దగ్గర అ%శీ%దించడం జరిగింది. చండూరు మున్సిపాలిటీలోని లబ్ధిదారులకు పాలకూరి దివ్య 15,500/- మగ్రి రామస్వామి16,000/- కే శోభా భర్త వెంకన్న 50,000 /- నెల్లూరు శ్రీనివాసులు 60,000 /- చిలుకూరు మల్లేష్ 60,000 /- చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్లు కోడి గిరిబాబు, నల్లగంటి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచుకొండ సంజయ్ , సంకోజు బ్రాహ్మం, ముజ్జు, భూతరాజు వేణు, గండూరి జనార్ధన్, బీనపల్లీ శేఖర్, పున్న దర్మేందర్ , కల్లెట్ల మారయ్య, గజ్జెల కృష్ణారెడ్డి, ఖలీల్, జూలూరు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులు వేగవంతం చేయాలి



**నల్గొండ జిల్లా బ్యూరో చండూర్ మే 19 (వెలుతురు):**
సోమవారం చండూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు డివైడర్ సంబంధించి టి.పి.ఓ, డి.ఈ, మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పర్యవేక్షించి పనులను వేగవంతం చేయాలని స్థానిక షట్టర్ యజమానులను పిలిచి వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చండూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టరు హరిప్రియ



**మేడ్చల్ వెలుతురు మే 19:**
జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఇంఛార్జి అదనపు కలెక్టరు హరిప్రియ స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (66) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఇంఛార్జి అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి అదనపు కలెక్టరు మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి ని ఘనంగా నివాళులర్పించిన సిపిఎం గ్రేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ



**హైదరాబాద్ వెలుతురు మే 19:**
సిపిఎం గ్రేటర్హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులోని సుందరయ్య విగ్రహం దగ్గర ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం గ్రేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం దశరథ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ సుందరయ్య పార్క్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గారు మాట్లాడుతూ ఆదర్శనేత అధ్యయనశీలి కామ్రేడ్ సుందరయ్య. సిపిఎంప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాడిన ఆదర్శ నేత సమాజ గమనాన్ని నిరంతరం అధ్యయనం చేసి ప్రజలలో పోరాట పటిమను పెంచిన అధ్యయన శీలీ కామ్రేడ్ సుందరయ్య అని సిపిఎం తెలంగాణ రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ కొనియాడారు పుచ్చలపల్లి సుందరయ్య గారి 40 వ వర్ధంతి సందర్భంగా సోమవారం బాగ్లింగంపల్లి సుందరయ్య పార్క్ లోని సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేసిన యోధుడు కామ్రేడ్ సుందరయ్య అని కొనియాడారు. దేశంలోని సంపద ఒక్క శాతంగా ఉన్న అగ్రవర్ణాల చేతిలో 40% పైగా పోగుపడి ఉంది అది అందరికీ దక్కాలని నిరంతరం కృషి చేసి పీడిత ప్రజల కోసం తన ఆస్తులు భూములను దానం చేసి సమాజం కోసం పిల్లల్ని కూడా వద్దనుకున్న ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు చట్టబద్ధ పదవులను అనుభవించినప్పటికీ ఆడంబరాలకు పోకుండా సైకిల్ పైనే పార్లమెంటుకు వెళ్లి, నిరాడంబరతకు నిలువెత్తున నిదర్శనంగా నేటి రాజకీయ నాయకులకు కూడా ఆదర్శప్రాయాలుగా నిలిచిపోయారు. పేద ప్రజల సమస్యలను చట్ట సభలలో చర్చించిన మహోన్నత నేత కామ్రేడ్ సుందరయ్య అని అన్నారు చట్ట సభలలో వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల ప్రాతిపదికగా అర్థవంతమైన రీతిలో ప్రజా సమస్యలను చర్చించి పార్లమెంటును ప్రజా సమస్యల చర్చా వేదికగా నిలిపారన్నారు. సిపిఎం గ్రేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ అగ్రకులంలో పుట్టినప్పటికీ తన పేరులో నుంచి రెడ్డిని తొలగించి సుందరయ్యగా మార్చుకున్నాడు. కుల వివక్షకు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి దళిత చేత ఆలయ ప్రవేశాలు చేయించి, సహపంక్తి భోజనాలు నిర్వహించిన ఆదర్శ నేత సుందరయ్య అని కొనియాడారు సమాజంలో వస్తున్న మార్పులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న చట్టాలను అధ్యయనం చేసి ప్రజలను పోరాటాల్లోకి తీసుకువచ్చి వారిని చైతన్యం చేశారని అన్నారు నీటి వనరులను వినియోగం, భూమిపై ఉన్న సహజ వనరులు ప్రజలందరివని సంపద వికేంద్రీకరణ జరగాలని దున్నేవాడికే భూమి ఇవ్వాలని ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన మహోన్నత నేత సుందరయ్య స్ఫూర్తితో ఆర్థిక సామాజిక రాజకీయ అసమానతలు లేని సమాజం కోసం చేసే పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ, సిపిఎం గ్రేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు. ఎం శ్రీనివాసరావు ఎం మహేందర్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, జి నరేష్, జి కిరణ్ , ఈ పద్మ, వాకర్స్ క్లబ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్కు అధ్యక్షులు నిరంజన్ రెడ్డి కార్యదర్శి మనోహర్ రెడ్డి ఉపాధ్యక్షులు కళ్యాణ్ వాకర్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి నాగభూషణం సంపత్ రెడ్డి మాజీ అధ్యక్షులు రమేష్ రెడ్డి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అండి జావిద్ ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి లెనిన్ ముషీరాబాద్ సిపిఎం పార్టీ నాయకులు కే రమేష్ నర్సింగరావు ఆర్ ఈ బాబు పి విమల తదితరులు పాల్గొన్నారు

https://epaper.velthuru.com

హైదరాబాద్ వెలుతురు

# టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలి

**మేడ్చల్ వెలుతురు మే 19:**

టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పనులలో తత్సారం ఉండకూడదని, నిర్ణీత గడువులో గా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. సోమవారం అల్వాల్ లోని టిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నిర్మాణ పనుల పురోగతి పై సమీక్షా సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. అసుపత్రి పనుల పురోగతి పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టరు కలెక్టరు వివరించారు. 90 శాతం పనులు





పూర్తయ్యాయని ఇంకొకరెండు నెలలో మిగిత నిర్మాణ పనులు పూర్తవుతాయని, కొన్ని చోట్లరీ డిజైన్ వలన కొంత అదనపు నిధులు అవసరమవుతున్నాయని కాంట్రాక్టర్ కలెక్టరుకు వివరించారు. చట్టబద్ధమైన ఆమోదాలు అటవీ శాఖ, AAI, పర్యావరణ అనుమతి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డునిర్మాణానికి NOC జారీ, నిర్మాణం కోసం విద్యుత్ మరియు నీటి కనెక్షన్ పొందబడింది. కాలుష్య నియంత్రణ బోర్డు స్థాపనకు సమ్మతిని జారీ చేసిందని సంబంధిత అధికారులు కలెక్టరుకు వివరించారు. అదేవిధంగాఈ ఆసుపత్రిలో టీచింగ్ ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీలు కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో ఫర్నిచర్ ఏవిధంగా అందిస్తారని కలెక్టరు అడుడగా, అధునాతన పరికరాలైన మెడికల్ ఎక్విప్ మెంట్, ఆపరేషన్ థియేటర్లు నిర్మించేందుకు అగ్రిమెంట్ లో ఒప్పందం జరిగిందని అదేవిధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు వివరించారు. కొన్ని అంశాలకు అవసరమైన డిఎంఎ అనుమతుల విషయంలో కలెక్టరు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని కలెక్టరు తెలిపారు. ఎప్పటివరకు ఆసుపత్రి పనులు పూర్తి చేసి అప్పగిస్తారని కలెక్టరు అడుడగా, డిసంబరు 2025 నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ వనజ,ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ ఉమాగౌరీ, అల్వాల్ తహాసీల్దారు రాములు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలపై సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 19:**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఫైర్ ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృతి చెందారు. ఐకానిక్ చార్మినార్ నుండి 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న 'గుల్జార్ హౌస్' భవనంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని, దాని ద్వారా 17 మంది మరణించడం చాలా బాధకరమైన విషయమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ పునరావృతం కాకుండా రంగారెడ్డి జిల్లాలో అక్రమ విద్యుత్ కనెక్షన్ ఉన్నట్లయితే వాటి ద్వారా ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టము కలగకుండా ఉండేలా మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్ శాఖ అధికారులు సమిష్టిగా పని చేస్తూ జిల్లాలో ఎక్కడ



అక్రమ విద్యుత్ కనెక్షన్ లేకుండా చూడాలని సూచించారు? అలాంటి కలెక్షన్లు ఏమైనా ఉన్నట్లు గమనించి వాటిని తొలగించాలని, ప్రజలకు వాటి ద్వారా జరిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం గురించి తెలియజేయాలని తెలిపారు. అక్రమ కనెక్షన్ లేకుండా చూడాలని, వారం రోజులపాటు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ విద్యుత్ కనెక్షన్లు లేకుండా చూసి ఎక్కడైన అలాంటి అక్రమ కనెక్షన్లు ఉన్నట్లయితే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, ఆశు పాత్రులలో, కమర్షియల్ ఏరియాలలో ఫైర్ సేఫ్టీ పాటిస్తున్నారా లేదా కూడా పరిశీలించాలన్నారు. లూజ్ కనెక్షన్ లేకుండా, వైరింగ్ బాగుందా లేదా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదాలు నివారించుటకు సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఫైర్ సేఫ్టీ పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఫైర్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాదారుల పీడ వదిలించిన హైడ్రా

- డైమండ్ ఎస్టేట్ లే ఔట్‌లో ఆక్రమణల కూల్చివేత
- కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకున్న అధికారులు

**హైదరాబాద్,మే19( వెలుతురు):**

భాగ్యనగరంలో మరోసారి హైడ్రా కూల్చివేతలు కొనసాగాయి. హైదర్‌నగర్ లో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు జరిగాయి. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేసారు. దీంతో స్థానికులు, హైడ్రా సిబ్బందికి వాగ్వాదం నెలకొంది. హైదర్‌నగర్‌లో భారీగా పోలీసులు మోహరించారు. కూకట్‌పల్లి పరిధి హైదర్‌నగర్‌లోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌ను ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసిన 79 మంది బాధితులకు న్యాయం చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్‌లో 79 మంది బాధితులకు ఈ స్థలం చెందుతుందని హైకోర్టు తీర్పునిచ్చింది. అయినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో బాధితులంతా హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్లాట్‌లోని యజమానులను కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైదర్‌నగర్‌లో కూల్చివేతలు చేస్తోంది. దాదాపు 20 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదానికి హైడ్రా పరిష్కారం చూపినట్లు తెలుస్తోంది. తొమ్మిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 79 మంది ప్లాట్ల ఓనర్లు హైడ్రాకు మద్దతు తెలిపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా హైదర్‌నగర్‌లో ఈ స్థలాన్ని ఆక్రమించి పార్కింగ్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి. ఓ ప్రైవేటు- వ్యక్తి ఈ ఆక్రమణలకు పాల్పడటంతో ఆ స్థలం యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దాదాపు 20 ఏళ్లుగా బాధితులు పోరాటం చేస్తున్నారు. చివరకు హైకోర్టు ఆదేశాలతో హైడ్రా రంగంలోకి దిగింది. ఈ భూమికి సంబంధించి ఎనిమిది నెలల క్రితమే తీర్పు వచ్చినప్పటికీ ప్రైవేటు వ్యక్తి ఖాళీ చేయకపోవడంతో హైడ్రా రంగ ప్రవేశం చేసి కూల్చివేతలు చేపట్టింది. హైదర్‌నగర్ నుంచి మియాపూర్ వెళ్లే మార్గంలో కూల్చివేతలు కొనసాగాయి. చుట్టూ షెడ్లను నిర్మించి అక్రమ పార్కింగ్




ఏర్పాటు- చేశారు. ఈ స్థలం అంతా కూడా హెచ్ఎమ్‌డీఏ లే అవుట్‌కు చెందినది. ఈ విషయాన్ని హైడ్రా నిర్ధారించింది. హైడ్రా చీఫ్ రంగనాథ్ ఇటీవల హైదర్‌నగర్‌లో ఆక్రమణలకు గురైె స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత హైడ్రా సిబ్బంది ఈరోజు నేరుగా కూల్చివేతలు చేపట్టింది. కూల్చివేతల సమయంలో ఈ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు యత్నించాడు. అతడిని వెంటనే అదుపులోకి తీసుకుని కూల్చివేతలు కొనసాగిస్తున్నారు. హైడ్రాకు సంబంధించిన వందలాది మంది సిబ్బందితో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జేసీబీల సహాయంతో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేబడుతోంది. ఇటీవల కాలంలో హైడ్రా పోలీస్‌స్టేషన్ ఓపెన్ చేసిన తర్వాత మరింత దూకుడు పెంచింది. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయనే దానిపై తమ దృష్టికి వస్తే ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరిపిన తర్వాత చర్యలు తీసుకుంటామని హైడ్రా చీఫ్ రంగనాథ్ చెబుతున్నారు. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 27 గుంటల స్థలంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ విస్తరించింది. ఇందులో మధ్యతరగతి ప్రజలు 79 మంది 2000 సంవత్సరంలో ప్లాట్లు- కొనుగోలు చేశారు. అనంతరం ఆ స్థలం తనదని శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి ఆక్రమణకు పాల్పడ్డాడు. అనంతరం ప్లాట్ల యజమానులను స్థలంలోకి రాకుండా హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. దీంతో బాధితులందరూ కోర్టుకు వెళ్లి 2024 సెప్టెంబర్‌లో స్థలాలను దక్కించుకున్నారు. న్యాయస్థానం ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయలేదు. బాధితులను లేఅవుట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో వారంతా హైడ్రాకు ప్రజావాణిలో గోడును వెలిబుచ్చారు. ఈక్రమంలో హైడ్రా సోమవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టింది. దీంతో ఎ÷-లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోసం వెళితే అరెస్టులా

- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,మే19( వెలుతురు):**

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీ సోకాల్డ్ ప్రజాపాలన అని నిలదీశారు. నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. అడవి బిడ్డల సంక్షేమం పట్ల మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.




తమ సంక్షేమం కోసం ఐటీ-డీఏ పీవోగా ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అని అడిగారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారి తప్పా అని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ గురువయ్యతోపాటు- అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజావాణికి (53) ఫిర్యాదులు



**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 19:**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-24 , ఇతర శాఖలకు - 29, మొత్తం 53 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ను వేగవంతం చేయాలని, ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి,




**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 19:**

ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియను వేగవంతం చేయాలని గడువు లోపు పూర్తి చేయాలని సంబంధిత ఎంపీడీవోలను మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియ, రాజీవ్ యువ వికాసం, తాగునీటి పై సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించడం జరిగింది. ఈనెల 25వ తేదీ వరకు గ్రౌండింగ్ ప్రక్రియ మొత్తం 100% పూర్తి చేయాలని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మంజూరి అయిన ప్రతి ఒక్కటి గ్రౌండ్ చేయాలని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ లాగా నిర్వహిస్తూ ఎంపీడీవోస్, మున్సిపల్ కమిషనర్లు అందరూ గడువు లోపు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ వికాసం పై సమీక్షిస్తూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వము దరఖాస్తులను ఆహ్వానించడం జరిగింది. మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తాగునీటి పై సమీక్షిస్తూ వేసవిలో ఇప్పటి వరకు జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా బాగా పని చేయడం జరిగిందని, రాబోయే 20 రోజుల వరకు కూడా ఇదే విధంగా ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పని చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపూ కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్ఓ సంగీత, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు వెంకట్రెడ్డి, అనంత్ రెడ్డి, డీఆర్డీఎ పిడి శ్రీలత, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి కేషరామ్, ఈడీ ఎస్. సి. కార్పొరేషన్ పద్మావతి, ఈఈ మిషన్ భగీరథ రాజేశ్వర్ రావు, ఎఈలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు తెగిపడ్డ హైటెన్షన్ వైరు

- వైరు తగలడంతో టూవీలర్ సహా కాలి బూడిదైన రైతు

**ఖమ్మం,మే19( వెలుతురు):**

33/11 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగ తెగిపడిన విషయాన్ని గమనించక పోవడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న రైతు అది తాకడంతో విద్యుత్ షాక్ తగిలి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, కొత్తూరులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీగా ఈదురుగాలతోపాటు- భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో విద్యుత్ లైన్ తీగ ఒకటి తెగి కింద పడింది. గ్రామానికి చెందిన పైడిమర్ల పెద్ద మురళీ రెడ్డి (59) అనే రైతు సోమవారం ఉదయం ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లాడు. అయితే, తెగిపడిన విద్యుత్ లైన్‌ను అతను గమనించలేదు. ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు వైరు దాటగా వాహనంతో సహా గుర్తుపట్టని రీతిలో కాలి బూడియ్యాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా సరఫరా నిలిపివేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అప్పల బాధతో కుటుంబం అదృశ్యం

**సిద్ధపేట,మే19( వెలుతురు):**

పట్టణంలో ఓ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఖాదర్‌పుర వీధిలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యమయ్యారు. ఫోన్లు కూడా ఇంట్లోనే వదిలేశారు. శనివారం ఉదయం నుంచి ఎవరు కనిపించకపోవడంతో ఏదైనా ఊరికి వెళ్లి ఉంటారని బంధువులు, స్థానికులు భావించారు. కానీ, రెండు రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో వారు కంగారు పడ్డారు. దీంతో బంధువులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

తమకు అప్పులు ఉన్నాయని.. డబ్బు ఇచ్చేవారు తిరిగి ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నాం అని ఆ లేఖ రాశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన వారి వివరాలు వీరబత్తిని బాలకిషన్, తండ్రి జనార్ధన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీషగా తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే నిజాలు

అధికారులు గుర్తించారు. ఆ వీడియోలను పాక్ ఏజెంట్ల తో పంచుకున్నట్లు భావిస్తున్నారు. దీనిపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో హర్యానాకు చెందిన ట్రావెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రాను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు- తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి దాదాపు మూడు నెలల ముందు ఆమె తరచూ జమ్ము కశ్మీర్‌లో పర్యటించినట్లు- కూడా అధికారులు గుర్తించారు. ఒకసారి చైనాకు కూడా వెళ్లొచ్చినట్లు- తేలింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు- అధికారులు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు- గుర్తించారు. ట్రావెల్ వ్లాగర్ జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు- తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు- గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు- అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది. అంతేకాదు ఓ పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో సన్నిహితంగా మెలుగుతున్నట్లు- కూడా తేలింది. అతడితో ఆమె అంతర్జాతీయ ట్రిప్‌కు కూడా వెళ్లింది. ఇండోనేషియాలోని బాలికి విహారయాత్రకు వెళ్లి వచ్చినట్లు- దర్యాప్తు అధికారులు తెలిపారు. జ్యోతిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. ఇక దర్యాప్తులో తాను తప్పు చేసినట్లు- జ్యోతి రాతపూర్వకంగా అంగీకరించినట్లు- సమాచారం. జ్యోతితోపాటు- మరో ఐదుగురి గుట్టు-ను కూడా అధికారులు బయటపెట్టారు. వారందరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

- తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షాలు

**హైదరాబాద్,మే19( వెలుతురు):**
మరో నాలుగు రోజులపాటు తెలంగాణలో వర్షాలు కురియనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు- పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతం లోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది.

## ఆశ్రయమివ్వడానికి...

# భారత్ ధర్మసత్రం కాదు

- శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీం



**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**
ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి భారతదేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థిగా తనకు ఇండియాలో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు ఒకరు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలంతో సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయ మూర్తులు దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దేశం విడిచివెళ్లడానికి ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను ఇండియా వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు ఇండియాలో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ పక్రియ మొదలు కాలేదని చెప్పారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని శ్రీలంక వాసి పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

# కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

**హైదరాబాద్,మే19( వెలుతురు):**
కాళేశ్వరం ప్రాజెక్టు విఆరణ కమిషన్ గడువును ప్రభుత్వం మరోమారు పొడిగించింది. కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మరో రెండు నెలలపాటు- గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీ-వల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు- తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

# సోలార్ విద్యుత్ ఆధారిత వ్యవసాయం చేసే నియోజకవర్గంగా అచ్చంపేటను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ మే 19:**
రాబోయే వంద రోజుల్లో ఈ అచ్చంపేట నియోజకవర్గంలో రైతులందరికీ వంద శాతం సబ్సిడీతో సోలార్ విద్యుత్ పంపుసెట్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గం సోలార్ ఆధారిత వ్యవసాయం చేసే విధంగా దేశానికి ఆదర్శంగా నిలుపుతానని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామం సభా వేదికలో ప్రకటించారు. మాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ కు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి



నల్లమల అభివృద్ధి డిక్లరేషన్ కరపత్రాలను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఎమ్మెల్యేలు



ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ఫైలాన్ ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు సీతక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పొన్నం ప్రభాకర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దానం నాగేందర్ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆయన సతీమణి డాక్టర్ అనురాధ



సభకు హాజరైన జనసందోహం

విక్రమార్క, మంత్రులు ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అక్కడే ఉన్న ఆదివాసి చెంచు గిరిజన రైతుల వ్యవసాయ భూమిలో ఏర్పాటుచేసిన సోలార్ వ్యవసాయ బోరు స్ప్రింక్లర్ డ్రిప్‌ను స్విచ్ ఆన్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక పథక ఉద్దేశాన్ని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. దేశానికే ఒక మాడల్‌గా, గిరిజన రైతుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ పథకం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన వికాసం పురోగతిని పరిశీలిస్తామనారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో భూమి లేని చెంచు గిరిజనుల విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి పది రోజుల్లోగా అందరికీ ఇండ్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు.

సభ విజయవంతం

అచ్చంపేట నియోజకవర్గం లోని ప్రజలు ఎలక్షన్ సమయంలో సభ ఏర్పాటు చేస్తే లక్షల మంది తరలివచ్చారు నాపై మన



బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 29 మంది పోడు భూముల రైతులతో ముఖాముఖి గా మాట్లాడుతూ, కీలక విషయాలను చెప్పారు. అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గంలో వచ్చే వంద రోజుల్లో రైతులందరికీ సోలార్ విద్యుత్ పంపుసెట్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్‌ను వ్యవసాయానికి, గృహావసరాలకు వినియోగించగా కొంత మిగులు ఉండేలా చూసుకొని , ఆ మిగులు విద్యుత్‌ను ప్రభుత్వ గ్రిడ్‌కు అనుసంధానం చేసే విధంగా ఉండే ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆమిగులు విద్యుత్‌ను ప్రభుత్వగ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా మహిళా సంఘాల ఆడబిడ్డలకు నెలకు 3 నుంచి 5 వేల రూపాయల మేరకు ఆదాయం లభిస్తుందని అన్నారు. ఈ గ్రామంలో ప్రారంభించిన ఈ పథకం నియోజకవర్గం మొత్తంలో విస్తరించడంతో పాటు ఈ పథకంపై లబ్దిదారులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తామని. వచ్చే సంవత్సరం ఇదే రోజు మరోసారి పర్యటించి ఇక్కడ ప్రారంభించిన ఇందిర సౌర గిరి జల

అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పై ఎంతో నమ్మకం ఉంచి 50 వేల పైచిలుకు ఓట్లతో గెలిపించడం అంటే నాపై మీకు ఎంత ప్రేమ, నమ్మకముందో ఈ సభ వేదిక ద్వారా నా హృదయం ఎంత సంతోషిస్తుందో చెప్పలేకపోతున్నాను. అని సీఎం రేవంత్ రెడ్డి తన సంతోషకరమైన వాస్తవాలన్ని ప్రజలకు తెలిపారు. పాలమూరు మట్టి మనసులు అంటే తట్టపారా తో కష్టం చేసేవారని అదే విధంగా దేశాన్ని ఏలే శక్తి కూడా ఉందని నిరూపించారని ఆయన అన్నారు. ఈ నమ్మకం ఇలాగే కొనసాగితే తెలంగాణను దేశంలో చిరస్థాయిగా నెంబర్ వన్ గా ఉంచడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అధికారులు అనధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోని గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపే సరికొత్త పథకానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 2,30,735 మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాలకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించే "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకానికి సంబంధించి "నల్లమల డిక్లరేషన్" ను ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి గారు మంత్రివర్గ సహచరులతో కలిసి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, మంత్రులతో కలిసి నల్లమల డిక్లరేషన్‌ను విడుదల చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "తెలంగాణను దేశానికే ఆదర్శంగా, నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పదిహేడు నెలల్లో నిరూపించాం. ఇది సరిపోదు. ఇంకా ఎంతో ముందుకు వెళ్లాలి. అందుకు ప్రజలందరూ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను అమలు చేసి చూపిస్తాం.

ప్రతి రైతుకు సోలార్ పంపుసెట్టు ఇవ్వడం ద్వారా విద్యుత్ అవసరం లేకుండా స్వయంగా ఆదాయాన్ని పెంచుకోవడానికి అచ్చంపేటలో చేసిన తరహాలో తెలంగాణ రాష్ట్రంలో చేయడానికి ప్రణాళికలు రూపొందించాలి.

నల్లమల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రత్యేకమైన ప్రణాళికలు రచించాలి. ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేస్తుంది. ఈ ప్రాంతానికి సాగునీరు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పోడు భూములకు హక్కులు కల్పించి పంట భూములుగా మార్చి గిరిజనులను ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించాం.

అచ్చంపేట నియోజకవర్గాన్ని, ఈ రాష్ట్రానికి దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యతను స్థానిక రైతులు, గిరిజనులు ఇక్కడికి విచ్చేసిన వేలాది మంది రైతులు బాధ్యతగా తీసుకోండి. ప్రపంచానికే అచ్చంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం.

ఈ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, కళాశాల వంటి పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందించిన తర్వాత వాటిపై అవసరమైన నిర్ణయాలు తీసుకుంటా.

ఈ ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. రుణమాఫీ, బోనస్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, 200 యూనిట్ల లోపు గృహ వినియోగంలో ఉచిత విద్యుత్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టడమే కాకుండా సన్న బియ్యం అందిస్తున్నాం..." అని ముఖ్యమంత్రి గారు అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రిమండలి సభ్యులు, పలువురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో పరిష్కార వేదిక కీలకం

- ప్రజా సమస్యల పరిష్కారమే తొలి మెట్టు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వెల్లడి

**విజయవాడ,మే19( వెలుతురు):**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కారంలోనూ.. సంక్షేమం, అభివృద్ధిలోనూ జిల్లాను నెంబర్ 1గా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని, ప్రతి అర్జీని సకాలములో నాణ్యవంతంగా పరిష్కరించాలని.. విజన్ -2047 లక్ష్యాల సాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలి మెట్టని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జగ్గయ్యపేట బి. కన్వెన్షన్ లో నిర్వహించారు. శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాత)తో కలసి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. నందిగామ డివిజన్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం విజయవాడలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని.. అయితే వేసవి నేపథ్యంలోనూ అదేవిధంగా డివిజన్ స్థాయిలో కూడా ప్రణాళిక ప్రకారం జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాలను నిర్వహించాలనే ఉద్దేశంతో సోమవారం జగ్గయ్యపేటలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు- తెలిపారు. నిర్దిష్ట గడువులోగా సమస్యను పరిష్కరించడం ఎంత ప్రధానమో అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించడం అంతే ప్రధానమని, అర్జీల పరిష్కార సంతృప్తి స్కోర్ ను పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి అధిక అర్జీలు అందుతున్నాయని వీటిపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని క్రమం తప్పకుండా ప్రతి అంశంపైనా సమీక్ష నిర్వహిస్తున్నట్లు- వెల్లడించారు. తహసీల్దార్లు ఎంపీడీవోలు, సర్వేయర్లు తదితరులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య పరిష్కార సామర్థం అనేది పాలనపై ప్రజల్లో విశ్వాసం పెంచుతుందని, ప్రతి అర్జీని పారదర్శకత, జవాబుదారీతనంతో పరిష్కరించాలన్నారు. మొత్తం 461 అర్జీలు స్వీకరించగా.. వీటిలో నందిగామ మండలానికి చెందినవి 38, చందర్లపాడు నుంచి 8, వీరుల్లపాడు నుంచి 4, కంచికచర్ల నుంచి 8, పెనుగంచిప్రోలు నుంచి 56, వత్సవాయి నుంచి 44, జగ్గయ్యపేట మండలం నుంచి 222 అర్జీలు రాగా మిగిలినవి ఇతర మండలాల నుంచి వచ్చాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వారం రోజుల్లోగా కార్యాచరణ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు- కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, నందిగామ ఆర్డీవో కె. బాలకృష్ణ, డి.ఆర్.డి.ఎ పీడీ ఏఎన్వీ నాంచారరావు, డీపీవో పి.లావణ్య కుమారి, డీఎస్పీలు ఏబీజీ తిలక్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సావధానంగా విని..అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. నియోజకవర్గ ప్రజలు విజయవాడ వెళ్లనవసరం లేకుండా సోమవారం జగ్గయ్యపేటలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేయడం చాలా ఆనందం కలిగిస్తోందని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాత) అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అనంతరం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారుల సమక్షంలోనే అర్జీలు స్వీకరించి వాటి తక్షణ పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగానికి స్పష్టమైన మార్గనిర్దేశర చేయడం జరిగిందన్నారు. పెన్షన్ల మంజూరు, ఇంటి స్థలం మంజూరు, ఉపాధి కల్పన తదితరాలపై ప్రజలు అర్జీలు సమర్పించడం జరిగిందని.. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు- తెలిపారు. అనంతరం శాసనసభ్యులు బీ కన్వెన్షన్ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన చెత్త నుంచి సంపద సృష్టి, వర్మీ కంపోస్ట్, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ స్టాళ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## నకిలీ పట్టాల పంపిణీపై విచారణ

- వంశీ కేసు విచారణ నేటికి వాయిదా



**విజయవాడ,మే19( వెలుతురు):**
గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీ మోహన్‌కు.. కొన్ని కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ వచ్చినా.. ఇంకా జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి వచ్చింది.. నకిలీ పట్టాల పంపిణీ కేసు వ్యవహారంలో వంశీ బెయిల్ పిటిషన్ పై సోమవారం ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో విచారణ జరిగింది.. నకిలీ పట్టాల పంపిణీ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కీలక ఆదేశాలు జారీ చేసింది నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు.. ఆ తర్వాత వల్లభనేని వంశీ మోహన్ బెయిల్ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది కోర్టు.. కాగా, ప్రస్తుతం గన్నవరం నియోజకవర్గంలో నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో విజయవాడ సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు వల్లభనేని వంశీ మోహన్.. ఆయన్ని మొదట అరెస్ట్ చేసిన కిడ్నాప్ కేసు, ఆ తర్వాత గన్నవరం టీ-డీపీ కార్యాలయంపై దాడి కేసు.. ఇలా అన్ని కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ వచ్చినా.. ఇప్పుడు నకిలీ పట్టాల పంపిణీ కేసులో రిమాండ్ ఖైదీగా వల్లభనేని వంశీ మోహన్ ఉన్నారు..

## జడ్జిలందరికి సమానంగా పెన్షన్

- కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం



**న్యూఢిల్లీ, మే19( వెలుతురు):**
అదనపు న్యాయమూర్తులతో సహా హైకోర్టు న్యాయమూర్తులందరికీ పూర్తి స్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని సోమవారం నాడు ఆదేశించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తులకు సంవత్సరానికి రూ.15 లక్షలు పెన్షన్ చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు చెప్పింది. కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండటంపై ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉద్యోగంలో చేరిన తేదీ, వారు అడిషనల్ జడ్జిలుగా రిటైర్ అయ్యారా, ఆ తర్వాత పర్మనెంట్ పోస్టులు ఇచ్చారా? అనే దానితో ప్రమేయం లేకుండా జడ్జిలందరికీ పూర్తి పెన్షన్ చెల్లించాలని జస్టిస్ అగస్టిన్ జార్జి అభిప్రాయపడ్డారు. జడ్జీలు చేరిన సమయం, డిజిగ్నేషన్ ఆధారంగా వ్యత్యాసం చూపడం సమానత్వమనే ప్రాథమిక హక్కుకు విరుద్ధమని అన్నారు. శాశ్వత న్యాయమూర్తులకు ఇచ్చే పెన్షన్, రి-టైర్‌మెంట్ ప్రయోజనాలనే మృతిచెందిన అదనపు హైకోర్టు న్యాయమూర్తుల కుటుంబాలకూ ఇవ్వాలని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

## ఆపరేషన్ సిందూర్‌పై ముదే సమాచారం

- కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**
ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల పాక్ అప్రమత్తం అయ్యిందని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. ఇది దుష్ప్రచారమని పేర్కొంది. ఇలాంటి వాటితో భారత్ పరువును ప్రతిష్టకు భంగం వాటిల్లగలదని తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తొలి దశలో పాక్ సహా ఇతర దేశాలకు సమాచారం ఇచ్చామని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపినట్లు పేర్కొంది. కానీ దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లినట్లు- కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తుందని తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం జైశంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది. భాజపా రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. రాహుల్ తమ ప్రభుత్వంపై నిందలు మోపాలనే దురుద్దేశంతోనే ఇటు-వంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇస్తూ.. మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చేసిన ప్రకటనను ఆ పార్టీ ఉటంకించింది. ఆపరేషన్ ప్రారంభించిన వెంటనే తాము ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నట్లు- పాక్‌కు చెప్పడానికి ప్రయత్నించగా.. భవిష్యత్తులో ఆ దాడులకు తాము తీవ్ర సమాధానం ఇస్తామని దాయాది దేశం చెప్పినట్లు- లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నట్లు- భాజపా తెలిపింది. జైశంకర్ విదేశాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆయనపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడింది. పీఐబీ సైతం కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయలేదని తన ఫ్యాక్ట్‌చెక్‌లో పేర్కొంది. రాహుల్ గాంధీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి ముందే ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లపై దాడి చేస్తున్నామని.. పాక్ సైన్యం వాటికి దూరంగా ఉండాలని భారత్ చెప్పినట్లు- జైశంకర్ పేర్కొన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అలా చేయడం వల్ల దాయాది దేశం ముందుగానే అప్రమత్తమయ్యిందని ఆరోపించారు.

## చర్లపల్లి కష్టాలు ఇంతింత కాదయా



**హైదరాబాద్, మే19( వెలుతురు):**
సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లలో రద్దీని తగ్గించడానికి చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి పలు బయల్దేరి చివరగా ఇక్కడే ఆగుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రయాణికులు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తృతమైన కనెక్టివిటీని అందించేలా చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు. ప్రధానంగా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడలో రద్దీని తగ్గించడానికి దీన్ని అత్యాధునికంగా తీర్చిద్దారు. దాదాపు రూ.430 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. అలాగే ఇక్కడి నుంచి కొన్ని రైళ్లను నడుపుతున్నారు. కానీ.. ప్రయాణికులు మాత్రం అసౌకర్యానికి గురవుతున్నారు. అందుకు కారణాలు ఇలా ఉన్నాయి.చర్లపల్లి రైల్వే స్టేషన్ సిటీకి దూరంగా ఉంది. స్టేషన్ నగరం వెలుపల ఉండటంతో చేరుకోవడం కష్టంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సులు, ఆటోలు తగినంత సంఖ్యలో అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు.చర్లపల్లికి మెట్రో స్టేషన్లు కూడా చాలా దూరంలో ఉన్నాయి. దీంతో మెట్రోలో రావడం కూడా కష్టంగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. అటు కేవలం కొన్ని ఎంఎంటీఎస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలు అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా.. ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.చర్లపల్లికి ఏ రైలు ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బంది పడుతున్నామని.. ప్రయాణికులు చెబుతున్నారు. స్టేషన్‌కు వెళ్లే రోడ్లు సరిగా లేకపోవడంతో.. ప్రయాణం కష్టంగా ఉందని అంటున్నారు. రాత్రి వేళల్లో స్టేషన్ పరిసరాలు అంతగా సురక్షితంగా ఉండటం లేదు అనే భావన ప్రయాణికుల్లో ఉంది.వెస్టర్న్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, రాయదుర్గం వంటి ప్రాంతాల నుంచి చర్లపల్లికి చేరాలంటే గంటన్నర.. రెండు గంటలు పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆటో, క్యాబ్ ఖర్చు ట్రెన్ టికెట్ల కంటే ఎక్కువ అవుతోందని అంటున్నారు.చర్లపల్లి నుంచి బయల్దేరే రైళ్లు భువనగిరి, వరంగల్ వైపు వెళుతున్నాయి. దాదాపు 18 రైళ్లు బయల్దేరి.. వివిధ ప్రాంతాలకు వెళుతున్నాయి. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఆదిలాబాద్ నుంచి చర్లపల్లికి రైలు టికెట్ సెకండ్ సిటింగ్ రూ.175, స్లీపర్ రూ.295 ఉంది. ఆ రైలులో చర్లపల్లిలో దిగాక ఆటో, క్యాబ్‌లో తక్కువ దూరం వెళ్లాలన్నా.. రూ.300 దాకా ఖర్చు పెట్టాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి అయితే.. ఈ ఛార్జీలు మరీ ఎక్కువ ఉంటున్నాయని చెబుతున్నారు.వరంగల్, ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే రైళ్లకు బదులుగా.. ముంబయి, పుణే, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లను.. చర్లపల్లి నుంచి నడిపిస్తే ప్రయోజనం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.పలు రైళ్లను చర్లపల్లి నుంచి నడపడం వల్ల సమస్యలు వస్తున్నాయని.. కొందరు ఎంపీలు సౌత్ సెంట్రల్ రైల్వే దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను గతంలో మాదిరి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా నడిపించాలని ఆదిలాబాద్ ఎంపీ కోరారు. సికింద్రాబాద్‌కు వెళ్లకపోవడం వల్ల ఆదిలాబాద్ నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

## ప్రమాదంలో పొలిటిక్స్....



**హైదరాబాద్, మే19( వెలుతురు):**
ప్రమాదం అనేది తెలియకుండానే జరుగుతుంది. కానీ ప్రమాదంలోనూ రాజకీయాన్ని వెతుక్కునే వారు నేతలు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రమాదాలను ఎవరూ ఆపలేరు. పాలకులు ఎన్ని సమీక్షలు నిర్వహించినా, ఎన్ని చర్యలు చేపట్టినా అనుకోకుండా జరిగే ప్రమాదాలను ఆపడం ఎవరి తరమూ కాదు. కానీ మన రాజకీయ నేతలున్నారే.. వారికి పొలిటికల్ పుడ్డు కావాలి. ప్రమాదాన్ని ప్రమాదంలా చూడరు. అందులోనూ అధికార పార్టీ తప్పులను వెదికే ప్రయత్నాలు చేస్తుంటారు. వారి హయాంలో జరిగిన ప్రమాదాల సంగతిని మాత్రం గుర్తుకు రావు. ప్రమాద స్థలిని సందర్శించి ప్రభుత్వ వైఫల్యం అంటూ గొంతెత్తి అరవడం రాజకీయ నేతలకు ఒక ఫ్యాషన్ గా మారింది. ప్రమాదం జరిగినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు బాధితులకు అండగా నిలవాలి. అవసరమైతే వారి పార్టీ నుంచి సాయాన్ని అందించాలి. అంతే తప్పించి ప్రమాద ఘటనను ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ పాతబస్తీలో అగ్ని ప్రమాదం జరిగి దాదాపు పదిహేడు మంది నాలుగు కుటుంబాలకు చెందిన వారు మరణించారు. ఉమ్మడి కుటుంబం. వీరు వ్యాపారులుగా వచ్చి ఇక్కడ స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. ప్రమాదం జరిగి బాధితులు ఒకవైపు రోదిస్తుంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని అంటూ రాజకీయ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే ప్రభుత్వం కావాలని ఆ ప్రమాదం చేసినట్లే మాట్లాడటం విచిత్రంగా ఉంది. హైదరాబాద్ పాతబస్తీలో ఘటన జరిగినను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఒకరకంగా రాజకీయంగా వ్యాఖ్యానించడం ఆశ్చర్యం కలిగించింది. కిషన్ రెడ్డి సాధారణంగా ఎప్పుడూ నోరు జారరు. చాలా ఆచితూచి మాట్లాడతారు. అలాంటి కిషన్ రెడ్డి సహాయ కార్యక్రమాలను అందించడంలో అగ్నిమాపక సిబ్బంది వెంటనే రాలేదన్నారు. అలాగే వారు వచ్చినా నీరు కూడా లేవని, ఆక్సిజన్ కొరత కూడా అగ్నిమాపక సిబ్బంది వద్ద లేవంటూ కిషన్ రెడ్డి అనడం కొంత ఇబ్బందికరంగా అనిపించింది. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని అనొచ్చు.అలాగే క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని కోరవచ్చు. అంతేకాని ప్రభుత్వ సంస్థల ఆలస్యమే ప్రమాద తీవ్రతకు కారణమని అనడం సరికాదంటున్నారు. ఇక నిత్యం ప్రభుత్వంపై ఒంటికాలు మీద లేచే బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఒక అడుగు ముందుకేసి ఈ ప్రమాదానికి బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వం అగ్నిప్రమాద శాఖపై సమీక్షచేయకపోవడం, ప్రభుత్వం అలసత్వమే ఇన్నిప్రాణాలు పోవడానికి కారణమని అంటున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయన్న హరీశ్ రావుకు తమ ప్రభుత్వం అధికారంలో ఉండగా జరిగిన ప్రమాదాల గురించి మర్చిపోయినట్లుంది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఇరవై ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో అనేక చోట్ల అగ్నిప్రమాదాలు జరిగి పదులసంఖ్యలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మరణించారు. కానీ నాటి ప్రమాదాలను మర్చిపోయి నేడు ప్రభుత్వవైఫల్యమంటూ నిందించడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు.మరో వైపు కాంగ్రెస్ మాత్రం ప్రమాదంపై రాజకీయాలు చేయవద్దని కోరుతుంది.

## మూడు రైల్వే స్టేషన్‌లు ప్రారంభానికి శ్రీకారం...




**వరంగల్, మే19( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 22న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ స్టేషన్ల చిత్రాలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) నిధుల ద్వారా చేపట్టిన పనులతో ఈ స్టేషన్లు విమానాశ్రయాల తరహాలో అత్యాధునిక హంగులతో ప్రకాశిస్తున్నాయి. స్టేషన్ల వెలుపలి, లోపలి భాగాలలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారుకరీంనగర్ రైల్వే స్టేషన్‌లో దాదాపు రూ. 26.64 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆధునీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ స్టేషన్‌ను పూర్తిగా మెరుగుపరిచారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారమ్ నుండి మరొక ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు మెట్లు ఎక్కే శ్రమను తగ్గించేందుకు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. విశాలమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన ప్లాట్‌ఫారమ్‌లు, ఆధునిక మరుగుదొడ్లు, మెరుగైన లైటింగ్, టికెట్ కౌంటర్లు, లాకర్ గదులు, తాగునీటి సౌకర్యం, ఏటీఎంలు, డిజిటల్ డిస్‌ప్లేలు, సీసీటీవీ కెమెరాలు వంటి అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను ఒకేసారి ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణలో ఎంపికైన మూడు స్టేషన్లలో కరీంనగర్ ఉండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ స్టేషన్ అద్భుతంగా మారిందని.. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.తీగలగుట్ట ఆర్వోబీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ కంటే అదనంగా మరో రూ.2 కోట్లు వెచ్చించి రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే.. ఉప్పల్ ఆర్వోబీ పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్ మరియు అధికారులను మందలించామని ఆయన పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. ఈ పథకం కింద ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, స్టేషన్లను ఆధునీకరించడం వంటి పనులు చేపడుతున్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఉచిత వై-ఫై సదుపాయం కల్పించడం. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయడం.స్టేషన్లలో ప్రయాణికుల సమాచార వ్యవస్థను మెరుగుపరచడం, పర్యావరణ అనుకూలమైన పద్ధతులను అవలంబించడం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి వీటిలో భాగంగా ఉంటాయి. తెలంగాణలో అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లలో ముఖ్యంగా.. సికింద్రాబాద్, బేగంపేట్, కాచిగూడ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రామగుండం, నల్గొండ, మిర్యాలగూడ, జనగాం, భువనగిరి, మధిర, యాదాద్రి వంటి స్టేషన్లు ఉన్నాయి. అయితే వీటిలో వరంగల్, కరీంనగర్, బేగంపేట్ రైల్వే స్టేషన్ల పనులు పూర్తయ్యాయి. అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 1309 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు.

# ఆరోగ్య సంరక్షణలో అగ్రగామిగా ఏపి

- వారసత్వ వ్యాధుల నివారణకు చర్యలు
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి




**విజయవాడ, మే19( వెలుతురు):**
ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న వ్యాధులను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం అని అన్నారు. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. విజయవాడలో పార్టీ కార్యాలయంలో వారధి గ్రీవియెన్స్ స్వీకరణలో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష. రాష్ట్రంలో 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారు. 2100 మంది తలసీమియాతో, ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. బాధితులకి క్రమం తప్పకుండా ఉచిత రక్త మార్పిడి చేస్తున్నాం. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, 10 లక్షల 50 వేల మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారు, 2100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నాం. నోడలాఫిసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు- శిక్షణ ఉంటు-ంది. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ జరుగుతుందని మంత్రి సత్యకుమార్ చెప్పారు.

# వారంపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

- విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడి



**విశాఖపట్టణం, మే19( వెలుతురు):**
రానున్న వారం రోజుల పాటు-రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. రాగల 24 గంటల్లో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. బాపట్ల, నంద్యాల, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, వైయస్ఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నేడు, రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈరోజు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్ పేట్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ములుగు, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది.

# అభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**విజయవాడ, మే19(వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 11నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారు అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కల్పిస్తామన్నారు. దేశంలోని కోటి సభ్యత్వం కలిగిన ప్రధాన పార్టీ తెలుగుదేశం అని ఎమ్మెల్యే కాకర్ల కొనియాడారు. వింజమూరు ఎస్వి కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే కాకర్ల టీడీపీ మహానాడు నిర్వహించారు. మహానాడులో టీడీపీ జెండా ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీ-డీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో 11 నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీఠ వేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 11 నెలల్లోని పార్టీని నందమూరి తారక రామారావు అధికారంలోకి తీసుకొచ్చారు. దేశంలోని కోటి సభ్యత్వం కలిగిన ప్రధాన పార్టీ తెలుగుదేశం. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కల్పిస్తాం' అని అన్నారు.

# పెరుగుతున్న దేశ ద్రోహుల జాబితా

- తాజాగా హర్యానా నుహ్‌లో మరొకరి అరెస్ట్
- అరెస్టయిన వారంతా ఐఎస్ఐకు సహకరిస్తున్న వారే

**న్యూఢిల్లీ, మే19( వెలుతురు):**
పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న పలువురు భారతీయుల్ని అధికారులు గుర్తించి ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికే హర్యానా, పంజాబ్, యూపీలో దాదాపు ఎనిమిది మంది గుఢచారులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అరెస్టయిన వారిలో విద్యార్థి, యూట్యూబర్, వ్యాపారవేత్త, గార్డ్ తదితరులు ఉన్నారు. తాజాగా మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. హర్యానా లోని నుహ్‌లో ఓ అనుమానితుడిని అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడు మేవాట్ జిల్లా టౌరు తహసీల్‌లోని కంగర్కా గ్రామానికి చెందిన మహ్మద్ తారీఫ్‌గా గుర్తించారు. అతడు పాక్ ఏజెంట్లకు భారత సమాచారాన్ని చేరవేస్తున్నట్లు గుర్తించారు. కాగా, నుహ్‌లో ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రజక గ్రామానికి చెందని అర్మాన్‌ను గూఢచర్యం ఆరోపణలపై రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా మొత్తం ఎనిమిది మంది అనుమానితుల్ని అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిలో గజాలా (పంజాబ్), యాసీన్ మొహమ్మద్, నోమాన్ ఇలాహి (యుపీ), 26 ఏళ్ల అర్మాన్ (నుహ్), 25 ఏళ్ల దేవేంద్ర సింగ్ ధిల్లాన్ (కైతాల్), మహమ్మద్ ముర్తజా అలీ (జలంధర్), జ్యోతి మల్హోత్రా (హర్యానా యూట్యూబర్), షహజాద్ (యుపీ మొరాదాబాద్) ఉన్నారు. తాజా అరెస్ట్‌తో తొమ్మిది మంది గూఢచారులను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు అయ్యింది. వీరంతా పాక్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు-..తమ స్వార్థం కోసం తల్లిలాంటి దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్లు వీరంతా అని చెప్పుకోవాలి. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో మొదలుపెడితే.. ఇప్పటి వరకు పాక్ కోసం పని చేస్తున్నట్లు- భావిస్తున్న 11 మంది గూఢాచారులు బయటపడ్డారు. భారత్, పాక్ యుద్ధం తర్వాత పోలీసులు, నిఘా వర్గాలు, ఇతర అధికారుల చేతికి వీరు చిక్కారు. వీరంతా హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు కావటం గమనార్హం. ఆ 11 మంది గురించిన వివరాల్లోకి వెళితే.. జ్యోతి మల్హోత్రాది హర్యానాలోని హిసర్. 33 ఏళ్ళ జ్యోతికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెలింగ్ వీడియోలు చేస్తూ ఉంటుంది. యూట్యూబ్‌లో ట్రావెల్ విత్ జో పేరిట ఛానల్ ఉంది. ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్‌కు చెందిన డానిష్ అనే ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో పాకిస్తాన్ కోసం గూఢాచారిగా పని చేయటం మొదలెట్టింది. పంజాబ్‌లోని మస్తఫుర్‌కు చెందిన దేవేంద్ర సింగ్ దిల్హన్ పాటియాల లోని ఖల్స కాలేజీలో ఎమ్‌ఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొన్నేళ్ల క్రితం ఇతడికి పాకిస్తాన్ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐలతో పరిచయం అయింది. అప్పటినుంచి భారత్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. మే 12వ తేదీన తన ఫేస్‌బుక్ ఖాతాలో పిస్టోళ్లు, గన్నుల ఫొటోలు పెట్టి అరెస్ట్




అయ్యాడు. పోలీసుల విచారణలో పాకిస్తాన్ కోసం పని చేసినట్లు- ఒప్పుకున్నాడు. తారిఖ్‌ది హర్యానాలోని కంగర్కా గ్రామం. పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న కారణంతో హర్యానా పోలీసులు, కేంద్ర నిఘా వర్గాలు సంయుక్తంగా కలిసి అతడ్ని అదుపులోకి తీసుకున్నాయి. 23 ఏళ్ల అర్మన్ భారత్, పాకిస్తాన్ యుద్ధం సమయంలో భారత దేశానికి సంబంధించిన విషయాలను పాకిస్తాన్‌కు చేరవేశాడు. హర్యానాలోని నోహ్‌లో ఇతడ్ని అరెస్ట్ చేశారు. 24 ఏళ్ల నౌమన్ ఇల్లహిది ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా. నౌమన్ హర్యానాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతడు పాకిస్తాన్ ఐఎస్ఐతో సంబంధం పెట్టు-కున్నాడు. పాకిస్తాన్‌కు సమాచారం అందించిన ప్రతీసారి డబ్బులు వచ్చేవి. అవి అతడి బావ మరిది అకౌంట్‌లో పడేవి. ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన షహజాద్ పాకిస్తాన్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో వస్తువుల్ని అక్రమ రావాణా చేస్తుంటాడు. పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెన్సీతో సంబంధం పెట్టుకున్నాడు. నిన్న కూడా దేశానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశాడు. దీంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అతడ్ని అరెస్ట్ చేసింది. మహ్మద్ ముర్తాజా అలీ పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐతో కలిసి పని చేస్తున్నాడు. పాకిస్తాన్ కోసం పని చేయటం కోసం ఏకంగా ఓ మొబైల్ యాప్‌ను తయారు చేశాడు. గుజరాత్ పోలీసులు ఇతడ్ని అరెస్ట్ చేశారు.

# ఆ ఆరు ఎవరికి




**హైదరాబాద్, మే19( వెలుతురు):**
తెలంగాణ కేబినెట్ విస్తరణ అంశంపై మళ్లీ తెరపైకి వచ్చింది. గత కొంత కాలంగా వాయిదా పడుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నెలాఖారు లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని తెలుస్తోంది. ఇదే విషయంపై రాష్ట్ర పీసీపీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణ అప్పుడు.. ఇప్పుడూ అంటూ చాలా రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్న దాటినా ఇంకా పూర్తిస్థాయి మంత్రివర్గం కొలువుదీరలేదు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి విస్తరణపై ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నప్పటికీ ఖరారు మాత్రం కావటం లేదు. ఈ ఏడాది ఉగాది వేళ తప్పకుండా విస్తరణ ఉంటుందని భావించినప్పటికీ జరగలేదు. అయితే తాజాగా మంత్రివర్గ విస్తరణ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని తెలుస్తోంది. ఇదే విషయాన్ని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచనప్రాయంగా ధ్రువీకరించారు. శనివారం నిజామాబాద్ లో మాట్లాడిన ఆయన పీసీసీ చీఫ్‌గా తనను కేవలం సలహాలు, సూచనలు మాత్రమే అడుగుతారని . తుది నిర్ణయం మాత్రం పార్టీ హైకమాండ్ దే అంటూ ఓ ప్రశ్నకు జవాబునిచ్చారు. పీసీసీ చీఫ్ ప్రకటన ద్వారా . మంత్రివర్గ విస్తరణ ఈసారి తప్పకుండా ఉండొచ్చన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతాయి2024, డిసెంబర్ 7వ తేదీకి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. అయినా ఇంకా 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. దీనిపై విమర్శలు వస్తున్నాయి. ఆశావాహులు కూడా అలక పూనుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పూర్తిస్థాయి కేబినెట్ ను ఏర్పాటు చేయాలని పార్టీలోని నేతలంతా కోరుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కీలక నేతలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఖాళీలను కూడా భర్తీ చేయాలని భావించినప్పటికీ లోక్ సభ ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో కాంగ్రెస్ అధినాయకత్వం . ఎన్నికలపై ఫోకస్ పెట్టాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాలు రావటంతో మళ్లీ పాలనపై ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. ఇదే సమయంలో పూర్తిస్థాయి కేబినెట్ టీమ్ తో ముందుకెళ్లాలని భావించినప్పటికీ పలు కారణాల రీత్యా వాయిదా పడుతూ వచ్చింది.మంత్రివర్గ విస్తరణ చోటు కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు స్థానాలు మాత్రమే ఖాళీ ఉండగా వీటి కోసం చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేలు కూడా వీటిని ఆశిస్తున్నారు. దీంతో కేబినెట్ లో ఎవరికి చోటు దక్కబోతుందనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుత కేబినెట్ లో నాలుగు ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. విస్తరణలో ఆ నాలుగు జిల్లాలకు కచ్చితంగా చోటు కల్పించాల్సి ఉంటుందన్న చర్చ గట్టిగా వినిపిస్తోంది.ప్రస్తుత కేబినెట్ లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి ఎవరూ లేరు. ఇక్కడ్నుంచి పార్టీ సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది.కేబినెట్ లో చోటు కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేబినెట్ లో కొనసాగుతున్నారు.

ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు ఇస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి జి. వివేక్, ప్రేమ్ సాగర్ రావు రేసులో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి మాత్రమే ఛాన్స్ దక్కే అవకాశం ఉంది.ఇక గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు లేరు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచి మాత్రమే ఖాతా తెరిచింది. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీలో చేరారు. ఆయన సిటీ నుంచి కేబినెట్ బెర్త్ ను కోరుతున్నారు. ఆయనే కాకుండా పలువురు నేతలు కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ బెర్త్ దక్కే అవకాశం ఉందన్న వార్తలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ కోణంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరును పరిశీలనలో ఉంది. దాదాపు ఆయనకు ఖరారయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు కల్పించే ఛాన్స్ ఉంది. ఈ కోణంలో ఒక్కరిద్దరి పేర్లు బలంగా తెరపైకి వస్తున్నాయి.ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యేతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేతలు కావటంతో . వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చన్న టాక్ కూడా వినిపిస్తోంది. ప్రస్తుత కేబినెట్ లో మైనారీవర్గాలకు చెందిన మంత్రి లేరు. దీంతో విస్తరణలో తప్పకుండా మైనార్టీ కోటా నుంచి ఒకరికి ఛాన్స్ దక్కటం ఖాయంగా కనిపిస్తోంది.ఆరు ఖాళీలు మాత్రమే ఉండి ఆశావాహులు ఎక్కువగా ఉండటంతో ఎవరికి ఛాన్స్ ఇవ్వాలనే దానిపై పార్టీ అధినాయకత్వం లోతుగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు పరిశీలించిన హైకమాండ్% . త్వరలోనే పలువురి పేర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అవసరమైతే నాలుగు ఖాళీలను మాత్రమే భర్తీ చేసి%ా% మరో రెండు ఖాళీలను తర్వాత భర్తీ చేసే అవకాశం ఉందన్న వాదన కూడా వినిపిస్తోంది. వీటిపై ఈనెలాఖారులోపు క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# సిబిల్ స్కోరు నిబంధనలపై యువత ఫైర్

**హైదరాబాద్, మే19( వెలుతురు):**
రాజీవ్ యువ వికాసం స్కీమ్ దరఖాస్తుదారులకు 'సిబిల్ స్కోర్ టెన్షన్ పట్టుకుంది. దీని ఆధారంగానే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తే.. తమ పరిస్థితేంటన్న భావనలో చాలా మంది ఉన్నారు. మరోవైపు సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక ఉండదని డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన చేసినప్పటికీ.. దరఖాస్తుదారుల్లో అనుమానాలు తొలగిపోవటం లేదు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రాయితీలపై రుణ సదుపాయం అందించేందుకు ప్రభుత్వం.. రాజీవ్ యువ వికాసం స్కీమ్ అమలు చేస్తోంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి అన్ని జిల్లాల నుంచి భారీగా అప్లికేషన్లు అందాయి. ఏకంగా 15 లక్షలకుపైగా అప్లికేషన్లు వచ్చాయి. అర్హతలకు తగ్గటుగా.. అందుబాటులో ఉన్న యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారు.మరోవైపు రాజీవ్ యువ వికాసం స్కీమ్ అర్హుల ఎంపిక ప్రక్రియపై తెలంగాణ సర్కార్ కసరత్తు కొనసాగుతోంది. ప్రస్తుతం మండల స్థాయిలో వెరిఫికేషన్ జరుగుతుండగా.. ఆపై జిల్లా కమిటీలకు సిఫార్సు చేస్తున్నారు. ఆ తర్వాత అర్హుల జాబితాలను వెల్లడిస్తారు.ఇదిలా ఉంటే అర్హుల ఎంపికలో బ్యాంకర్లు సిబిల్ స్కోర్ ను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. సిబిల్ స్కోర్ బాగుంటేనే స్కీమ్ కు అర్హత లభించే అవకాశం ఉంటుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తలతో చాలా మంది దరఖాస్తుదారులు ఆందోళనకు గురయ్యారు.సిబిల్ స్కోర్




నిబంధన వార్తల నేపథ్యంలో ఇటీవలనే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క స్పందించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక సిబిల్ స్కోర్ ఆధారంగా జరుగుతుందని చేస్తున్న ప్రచారం అవాస్తవమని కొట్టిపారేశారు. ఇలాంటి వార్తలను నమ్మవద్దని కోరారు. జూన్ 2వ తేదీ నుంచి నియోజకవర్గాల వారీగా శాంక్షన్ లెటర్ల పంపిణీ జరుగుతుందన్నారు.ఉముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ సిబిల్ స్కోర్ నిబంధన అంశంపై ప్రచారం ఆగటం లేదు. సిబిల్ స్కోర్ 700 పైగా ఉండాలని అలాంటి వారికే ప్రాధాన్యత ఉంటుందనే వార్తలు తెరపైకి రావడంతో నిరాశకు లోనవుతున్నారు.దరఖాస్తుదారుల బ్యాంక్ లావాదేవీల పరిశీలనతో పాటు పాన్ కార్డు ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. గతంలో ఏమైనా రుణాలు తీసుకున్నారా..? తీసుకుంటే ఏ విధంగా రుణాల చెల్లింపు ప్రక్రియ జరిగింది..? వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాంకర్లు వైపు నుంచి పకడ్బందీగా ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుండగా సిబిల్ స్కోర్ ను కూడా ప్రమాణికంగా తీసుకుంటున్నారా..? అనే చర్చ జోరుగా జరుగుతోంది.సిబిల్ స్కోర్ అనేది ప్రతి ఒక్కరికి ఉండకపోవచ్చు. దీంతో చాలా మంది దరఖాస్తులు అయోమయానికి గరువుతున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ ఈ ప్రచారం మాత్రం ఆగటం లేదు. మరోవైపు లబ్ధిదారుల జాబితాల వెల్లడికి సమయం దగ్గరపడుతోంది. జూన్ 2న మంజూరు పత్రాలను అందజేస్తారు. సమయం దగ్గరపడుతున్న వేళ . సిబిల్ స్కోర్ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని పలువురు దరఖాస్తుదారులు కోరుతున్నారు !సిబిల్ స్కోర్ వార్తలు ప్రచారమవుతున్న వేళ తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన ఉంటుందా..? దరఖాస్తుదారుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటుందా..? అనేది ఉత్కంఠగా మారింది .!

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# త్వరలోనే నంది అవార్డుల పునరుద్ధరణ

## చిత్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

## మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లో సినిమా పరిశ్రమ అభివృదంది కోసం అవసరమైన ప్రణాళికలు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రచిస్తున్నామని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భైరైవం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. ఏపీలో అద్భుతమైన అందాలున్నాయి. ఇక్కడ సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. ఇంకా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చెందాల్సి ఉంది. దానికి సంబంధించి స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు నిర్మించడానికి అవసరమైన మద్దతు ఇవ్వడానికి పాలసీ తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ మాదిరిగానే విశాఖపట్నం అభివృద్ధి చేస్తాం అని అన్నారు. చాలాకాలంగా మూలన పడిపోయిన నంది అవార్డులను పునరుద్ధరిస్తాం. అతి తర్వలో ఆ అవార్డులకు సంబంధించి ప్రకటన ఇస్తాం. పరిశ్రమకు చెందిన ముఖ్యమైన నిర్మాతలు, దర్శకులు, నటులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నూటికి నూరు శాతం సినిమా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం అని అన్నారు. ఇదిలావుంటే భైరవం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు వస్తున్నానని నటి అదితి శంకర్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మించారు. ఈ సినిమాలో మరో ఇద్దరు కథానాయికలుగా ఆనంది, దివ్య పిళ్ళై నటించారు. మే 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అదితి శంకర్ మాట్లాడారు.



# ఆర్ముగ్‌కుమార్ ఆదుకోవడంతోనే ఈ స్థాయిలో ఉన్నా



## తమిల నటుడు విజయ్ సేతుపతి వెల్లడి

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. విలక్షణ నటుడిగా అన్ని భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగా మాత్రమే కాకుండా ఎలాంటి పాత్ర అయిన పడించగల సతా ఉన్నవాడు. ముఖ్యంగా విలన్‌గా విజయ్ యాక్టింగ్‌కి విపరీతమైనా ఫ్యాన్ ఫాలోయింద్ ఉంది. ప్రస్తుతం 'ఏస్'సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విజయ్ తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలి రోజుల్ని గుర్తుచేసుకున్నారు. విజయ్ మాట్లాడుతూ.. ' కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో 'వర్ణం' అనే సినిమాకు ఆడిషన్‌కు వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లాక సీన్ చెప్పి డైలాగులు కూడా నన్నే రాసుకొని నటించమన్నారు. అప్పుడే తెలుసుకున్న నేను డైలాగులు కూడా రాయగలనని. ఆర్ముగ కుమార్ ఆ టీమ్‌కు నా పేరు సజెస్ట్ చేశారు. అలా ఆ సినిమాలో అవకాశం వచ్చింది. అలాగే క్లాసిక్ మూవీ '96'లో నేను నటించడానికి కూడా ఆయనే కారణం. 'ఒకసారి ఈ సినిమాకు విజయ్ సేతుపతి ఆడిషన్ తీసుకోండి. పాత్రకు సరిపోదు అనుకుంటే తిరస్కరించండి' అని ఆర్ముగ కుమార్ '96' టీమ్‌కు చెప్పారు. మనం అంటూ ఒక స్థాయి వచ్చాక ఎవరైనా సహాయం చేయడానికి ముందుంటారు. కానీ మనం ఎవరో తెలియనప్పుడు కూడా సహాయం చేయడం గొప్ప. ఆ సాయం చీకటితో నిండిన ఇంట్లో దీపం వెలిగించడం లాంటింది. అలా నా జీవితంలో ఆ దీపాన్ని వెలిగించిన మనిషి ఆర్ముగ కుమార్. అతడికి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని విజయ్ సేతుపతి అన్నారు.

# కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు

## తెరంగేట్రానికి సిద్దంగా రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో నటుడు అరంగేట్రం చేయబోతున్నాడు. పెద్ద కుమారుడు, రమేష్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా పరిచయం కానున్నారని, గత కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోషల్ మీడియాలో జయకృష్ణకు సంబంధించిన ఓ ఫొటో షూట్ బయటకు రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. బ్లాక్‌సూట్‌లో మెస్మరైజింగ్‌లో లుక్‌లో కనిపించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. కాగా జయకృష్ణ లండన్‌లో నటనలో ప్రొఫెషనల్ -ట్రైనింగ్ తీసుకున్నాడు. అయితే తాజాగా జయకృష్ణను తెలుగు చిత్రసీమలో ఆవిష్కరించేందుకు దర్శకుడు సిద్ధం అయ్యాడు. ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' లాంటి చిత్రాలతో బోల్డ్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వం జయకృష్ణ ఎంట్రీ ఇవ్వనున్నట్లు- సమాచారం. వైజయంతీ మూవీస్, ఆనంది ఆర్ట్స్ ఈ ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మించనున్నాయి. అంటే ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఇద్దరు ప్రముఖ నిర్మాతలు సంయుక్తంగా నిర్మించనున్నారని తెలుస్తోంది. అయితే అజయ్ భూపతి మాత్రం ప్రస్తుతం 'మంగళవారం 2'తో బిజీగా ఉన్నప్పటికీ, జయకృష్ణ డెబ్యూ సినిమాను కూడా త్వరలో సెట్స్‌పైకి తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నాడట. కాగా ఈ సినిమా కథ యాక్షన్, ఎమోషన్ తో యువతను ఆకర్షించేలా ఉంటుందని అంటున్నారు. అంతే కాదు మహేష్ బాబు ఈ ప్రాజెక్ట్‌ను దగ్గరుండి చూస్తూ, కొన్ని నిర్మాణ అంశాల్లో కీలక సలహాలు ఇస్తున్నాడని సమాచారం.



# మహాభారతంలో కృష్ణుడి పాత్రచేయాలని ఉంది

## నటుడు జూనియర్ ఎన్టీఆర్ మనోగతం



జూనియర్ ఎన్టీఆర్ పెద్ద ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నాడు. దేవర మూవీతో మంచి హిట్ అందుకున్న ఆయన.. ఇప్పుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో భారీ సినిమా చేస్తున్నాడు. డ్రాగన్ అనే పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతానికి షూటింగ్ జరుగుతోంది. తర్వత దేవర-2, ఆ తర్వాత నెల్సన్ తో మూవీ ఉండొచ్చు. ఎన్టీఆర్ అంటే నటనకు మారుపేరు. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోవడం ఆయనకు చాలా సులువు. ఎన్టీఆర్ నటనను ఎంతో మంది డైరెక్టర్లు మెచ్చుకున్నారు. ఇప్పటికే ఎన్నో వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించి మెప్పించాడు ఎన్టీఆర్. అలాంటి నటన కనబరిచే ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ ఏంటో చాలా మందికి తెలియదు. ఎన్టీఆర్ కు ఉన్న ఒకే ఒక్క డ్రీమ్ రోల్ మహాభారతంలో కృష్ణుడి పాత్ర చేయడం. ఆ విషయంలో గతంలో కూడా బయటపెట్టాడు ఎన్టీఆర్. దర్శక ధీరుడు రాజమౌళి మహాభారతం సినిమాను తీస్తానని గతంలోనే ప్రకటించాడు. కాకపోతే దానికి చాలా సమయం పడుతుందన్నాడు. ఒకవేళ జక్కన్న ఈ మూవీ తీస్తే అందులో ఎన్టీఆర్ డ్రీమ్ రోల్ లో నటిస్తాడేమో చూడాలి. ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు జూనియర్. మొన్ననే త్రిబుల్ ఆర్ కాన్సర్ట్ లో పాల్గొని వచ్చాడు. ఇప్పుడు కర్ణాటకలో డ్రాగన్ షూటింగ్ లో పాల్గొంటు-న్నాడు.

# థియేటర్ యజమాన్యాలతో ఎగ్జిబిటర్ల విభేదాలు

## జూన్ 1నుంచి థియేటర్ల బంద్ ఆలోచన



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని సినీ ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. రెంటల్ బేసిస్‌లో సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో ఎగ్జిబిటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు పర్సంటేజీ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఆదివారం ఏర్పాటు- చేసిన సమావేశానికి నిర్మాతలు దిల్ రాజు, సురేశ్ బాబుతోపాటు- 60 మంది ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. చాలా రోజులుగా పర్సంటేజీలపై ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చర్చ నడుస్తోంది. రెంటల్ పద్దతిలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఓ వైపు ఎగ్జిబిటర్లు అంటుండగా.. మరోవైపు వారికి పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఎగ్జిబిటర్ల జాయింట్ మీటింగ్‌లో పర్సంటేజీ, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. నిర్మాతలకు ఇందుకు సంబంధించిన ఓ లేఖ రాయాలని సమావేశంలో తీర్మానించారు.

# బాలనటుడు భరత్‌కు మాతృవియోగం

టాలీవుడ్ నటుడు, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ భరత్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి కమలహాసిని ఆదివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆమె అకాల మరణంతో భరత్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ విషయాన్ని కుటంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, సన్నిహితులు ఆయనకు ఫోన్ చేసి ధైర్యం చెబుతున్నారు. బాల నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్.. ప్రస్తుతం పలు చిత్రాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు.తెలుగులో అంజి సినిమాతో కెరీర్ ప్రారంభించాడు. రెడీ, ఢీ, దూకుడు, హ్యాపీ, దేనికైనా రెడీ ఇలా తెలుగు, తమిళ భాషల్లో వందకుపైగా సినిమాల్లో నడించాడు. రెడీ, బిందాస్ సినిమాల్లో నటనకుగాను నంది అవార్డులు అందుకున్నాడు.







# రాజ్-సమంతల వ్యవహారం

## ఆసక్తి రేపుతోన్న రాజ్ భార్య పోస్ట్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి రోజుకో న్యూస్ వైరల్ అవుతూనే ఉంది. మూవీస్ విషయం పక్కన పెడితే ఎక్కువగా తన వ్యక్తిగత విషయాలు ఏదో ఓ రూమర్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇక సామ్ రెండో పెళ్లికి సిద్ధమైనట్లు, దర్శకుడు రాజ్ నిడిమోరుతో ఆమె ప్రేమలో పడిందని, గత కొంతకాలంగా ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియాలో వరుస వార్తలు ప్రచారం అవుతున్నాయి. సమంత ఎక్కడ ఉంటే అక్కడ రాజ్ ఉంటున్నాడు.దీంతో నెట్టింట ఎక్కడ చూసినా వీరిద్దరి గురించే విపరీతంగా చర్చ నడుస్తోంది. ఈ రూమర్స్‌పై సమంతగానీ, రాజ్ గానీ ప్రత్యక్షంగా స్పందించలేదు. కానీ రాజ్ నిడిమోరు భార్య శ్యామలి దే పెడుతున్న పోస్ట్‌లు చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా ఆమె పెట్టిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. 'మంచి కర్మను సృష్టించండి. ప్రజలకు సాయం చేయండి. అందరితో న్యాయంగా వ్యవహరించండి' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు పెట్టింది. అంతకు ముందు 'నా గురించి మాట్లాడేవారికి.. నా తరఫున మాట్లాడేవారికి.. నేను చెప్పేది వినేవారికి.. నా గురించి వార్తలు వినేవారికి.. నా గురించి రాసే వారికి.. నా కోసం ఆలోచించేవారందరికీ దేవుడు ఆశీర్వాదం, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నా' అనే పోస్ట్‌ను ఆమె షేర్ చేసింది. మొన్నటి వరకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేని శ్యామలి, సామ్-రాజ్ డేటింగ్ రూమర్స్ మొదలైనకానుండే సడన్ గా పోస్టులు పెడుతుంది. దీంతో ఆమె వీరిద్దరిని ఉద్దేశించే పెడుతున్నట్లు-గా కామెంట్స్ వినిపిస్తున్నాయి.





# త్వరలోనే పెళ్లిపీటలెక్కనున్న విశాల్.. పెళ్లి కూతురు టాలీవుడ్ హీరోయినే..!

ప్రముఖ నటుడు విశాల్ త్వరలో పెళ్లిపీటలెక్కనున్నాడు. ప్రస్తుతం ఆయన పెళ్లి టాపిక్ టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పెళ్లి వార్తలను విశాల్ సైతం ధ్రువీకరించిన విషయం తెలిసిందే. తాజాగా నటుడు చూసుకోబోది ప్రముఖ హీరోయిన్ సాయి ధన్సికనేనని సమాచారం. గత కొంతకాలంగా ఇద్దరు ప్రేమలో ఉన్నారని.. పెళ్లికి ఇటీవల రెండు కుటుంబాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. త్వరలోనే వివాహబంధంతో ఒక్కటి కాబోతున్నట్లుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటి వరకు విశాల్ గానీ, ధన్సిక కానీ స్పందించలేదు. ఇదిలా ఉండగా.. ఇటీవల నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో విశాల్ మీడియాతో మాట్లాడారు. క్రమంలో పెళ్లిపై ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నానని.. జీవిత భాగస్వామిని సైతం గుర్తించానని.. పెళ్లి విషయంలో చర్చలు జరుగుతున్నట్లు విశాల్ తెలిపాడు. ఇది ప్రేమ పెళ్లేనని.. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నట్లు తెలిపాడు. గతంలో నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన తర్వాత పెళ్లి చేసుకుంటానని విశాల్ ప్రకటించిన విషయం విధితమే. ఇచ్చిన మాట ప్రకారం భవన నిర్మాణం పూర్తి కావడంతో పెళ్లికి రెడీ అయ్యారు. ఇక విశాల్ పెళ్లి వార్తలు కొత్తేం కాదు. గతంలో పలువురు హీరోయిన్లను పెళ్లి చేసుకోబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. వరలక్ష్మి శరత్ కుమార్, అభినయను పెళ్లి చేసుకుంటారని వార్తలు వచ్చినా అవేవి నిజం కాలేదు. వాస్తవానికి విశాల్‌కు గతంలో హైదరాబాద్‌కి చెందిన అనీషా అనే అమ్మాయితో పెళ్లి జరగాల్సి ఉన్నా ఎందుకో రద్దు చేసుకున్నారు. నిశ్చితార్థం జరిగినా అది పెళ్లిపీటల దాకా చేరలేదు. ధన్సిక విషయానికి వస్తే.. తమిళనాడులోని తంజావూరు ఆమె స్వస్థలం. తమిళం, కన్నడం, మలయాళం, తెలుగులోనూ పలు చిత్రాల్లో నటించింది. 2006లో తమిళ చిత్రంలో నటించింది. తెలుగులో 2022లో 'షికారు' మూవీలో నటించింది. ఆ తర్వాత అంతిమ తీర్పు, దక్షిణ సినిమాల్లోనూ కనిపించింది. ఇక విశాల్ చివరిసారిగా మద గజ రాజ మూవీలో నటించారు. ప్రస్తుతం తుప్పరివాలం-2 మూవీలో నటిస్తున్నాడు. ఈ మూవీకి దర్శకత్వం సైతం వహిస్తుండడం విశేషం.



వెలుతురు
రాష్ట్రీయం । జాతీయం
https://epaper.velthuru.com
మంగళవారం 20 మే 2025

# దోచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమిటి

- విద్యుత్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరిచారు
- జగన్ తీరుపై మండిపడ్డ జివి



**గుంటూరు,మే19( వెలుతురు):**

జగన్‌కి తండ్రి వైఎస్ రాష్ట్రాన్ని దోచుకోవడం మాత్రమే నేర్పారని, నాయ్యకత్వ లక్షణాలు బోధించలేదని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి దోచుకున్నారని అన్నారు. అవినీతిపరులే నేడు నీతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి రంగంతో సహా అనేక రంగాల్లో అభివృవృద్ధి తిరోగమనంలో సాగిందన్నారు. హేతుబద్దత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన తరవాత చంద్రబాబు అహోరాత్రులు కష్టపడుతూ ఎపిని ముందుకు తీసుకుని పోగా, దానిని వెనక్కి నెట్టే యత్నాల్లో జగన్ ఐదేళ్ల పాలన సాగిందని అన్నారు. తిరి గాడిలో పెట్టి అభివృద్ధిలో పరుగెత్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్న దశలో జగన్‌కి ఏమైనా అభిమానం ఉంటే తగిన విధంగా సహకారం అందించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో చెరువులు ఆక్రమించుకుంటే తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు తిరిగి అభివృద్ధి చేస్తోందని గుర్తు చేశారు. జగన్ పోలవరం సహా అన్నింటిని వెనక్కి మళ్లేంచే యత్నాలతో ఎపిని అధోగతి పాలు చేసిందని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై కోట్ల భారం మోపారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో ఏం అభివృద్ధిచేశారో వైసీపీ నాయకులు చెప్పగలరా అని ప్రశ్నించారు. బూటకపు హామీలతో అధికారం చేపట్టారని, తర్వాత వాటిని గాలికి వదలి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. అన్నక్యాంటీన్, నిరుద్యోగ భృతి, ఎస్సీ, బీసీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా పథకాలు, విదేశీ చదువులకు ఇచ్చే ప్రోత్సాహకాలు నిలిపివేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేలా ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదన్నారు. హామీలు గుప్పించడం, మభ్యపెట్టడం, ప్రజలు నెత్తిన భారం వేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా నేతల్లో మార్పు కానరావడం లేదన్నారు. వైసీపీ పాలనలో ఊరికో ఉన్మాది తయారయ్యారని.. ప్రభుత్వ ఉదాసీన వైఖరితోనే కిరాతకులు పెట్రేగారని అన్నారు.

# కాళేశ్వరంలో కొనసాగుతున్న పుష్కరాలు

- పుణ్యస్నానాల కోసం తరలి వస్తున్న భక్తులు



**కాళేశ్వరం,మే19( వెలుతురు):**

కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కరాలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం కూడా భక్తులు పుణ్యస్నానాలకు తరలి వచ్చారు. సోమవారం కావడంతో కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజైన ఆదివారం సెలవు కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. త్రివేణి సంగమ పుష్కరిణి ఐదురోజులుగా జనంతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు– ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు పరవశించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలు సరస్వతి తీరం వెంట సైకత లింగాలు ఏర్పాటు– చేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె సమర్పించి నదిలో దీపాలు వదిలారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వచనాలు పొందారు. సాయంత్రం సమయంలో నదీతీరాన సరస్వతి విగ్రహం ముందు నిర్వహించిన మహాహారతి క్రతువును చూసి భక్తులు పరవశించిపోయారు. ఆదివారం పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి పుష్కరస్నానం చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు. పుష్కర స్నానాలు చేసిన భక్తులు శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామి సన్నిధానానికి చేరుకున్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జానుసహించం

- వాటిని తిరిగి స్వాధీనంచేసుకుంటాం
- మంత్రి నారాయణ హెచ్చరికలు



**నెల్లూరు,మే19( వెలుతురు):**

ప్రభుత్వ భూములు ఆక్రమించాలన్న ఆలోచన మానుకోవాలని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని మంత్రి పొంగూరు నారాయణ వార్నింగ్ ఇచ్చారు.. నెల్లూరు సిటీ అభివృద్ధిపై అధికారులు, కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు, కో–ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి.. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. త్వరలోనే సిటీ– నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడా ఆగటం లేదని స్పష్టం చేశారు.. ఇక, రాష్ట్రంలో 68 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.. 32 వేల కోట్లు– ప్రభుత్వానికి ఖర్చు అవుతోంది.. నిబంధనల ప్రకారం అనర్హుల కార్డులు మాత్రమే తొలగిస్తున్నామని వెల్లడించారు.. కానీ, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని.. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలని పట్టించుకోవద్దని మంత్రి పొంగూరు నారాయణ సూచించారు.

# సేంద్రీయ ఎరువులతోనే లాభం

- వర్మీ కంపోస్టుకు ప్రాధాన్యం ఇవ్వాలి



**నిజామాబాద్,మే19( వెలుతురు):**

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మట్టిలో పోషకాలను పెంచేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయా అధికారులు రైతులకు సూచించారు.. రసాయన ఎరువుల వినియోగం పెరిగి భూమికి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అన్నదాతలు ఈ విషయాన్ని గుర్తించి రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. రైతన్నలు మట్టిని కాపాడితే సమాజాన్ని కాపాడినవారు అవుతారన్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం కోల్పోయి పంట నాణ్యత హీనంగా వస్తుందన్నారు. తద్వారా ఆ పంటను స్వీకరించిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు,. వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయించుకుని రైతులు తమ పోలాల్లో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చన్నారు. అవసరమైనంత మేరకు నత్రజని పోటాష్‌లు, వినియోగించాలన్నారు అంతేకాకుండా భూమి యొక్క బౌతిక రసాయన స్థితిని బట్టి ఆభూమిలో ఏయే పంటలు పండుతాయి అనే విషయాన్ని కూడా తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. అధిక మొత్తంలో రసాయనాలు వాడి భూమిలోని పోషకాలు తగ్గించకుండా భూమిని జాగ్రత్తగా కాపాడు కోవాల్సిన అవసరం రైతులపై ఉందన్నారు. భూసారం తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే తెలుసుకుని వాటిని అవలంబించాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పంటు పండే అవకాశం ఉందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలను భూమి ఇస్తుందని భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. ఇదిలావుంటే మండల స్థాయిలో, గ్రామీణ స్థాయిలో కూడా ప్రైవేట్ వ్యక్తులు మట్టి తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అధికారులను పాటించాలన్నారు. వర్మికంపోస్టు యూనిట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడేందుకు ప్రభుత్వం రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రధానంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలలో రసాయనాల వాడకం తగ్గించడం ద్వారా ప్రజలకు మేలైన కూరగాయలు అందేలా చేయాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగులో కంపోస్టు ఎరువుల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నందిగం సురేశ్‌కు జూన్ 2వరకు రిమాండ్

- గుంటూరు జైలుకు తరలించిన పోలీసులు

**గుంటూరు,మే19( వెలుతురు):**

వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయులను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు– చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. 14 రోజుల పాటు రిమాండ్ విధించింది న్యాయస్థానం. దీంతో నందిగం సురేష్‌ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసులలో వైసీపీ మాజీ ఎంపీ బెయిల్‌పై ఉన్నారు. సోమవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం




మంగళగిరి కోర్టులో మాజీ ఎంపీని పోలీసులు హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది.గత శనివారం రాత్రి మాజీ ఎంపీ స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో టీడీపీ కార్యకర్త రాజు అనే వ్యక్తిపై నందిగం సురేష్, అతడి సోదరుడు, అనుచరుడు మూకుమ్మడి దాడి చేశారు. తన భర్తపై హత్యప్రయత్నం చేశారంటూ రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. రాజును కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు– నిర్ధారించి నందిగం సురేష్‌తో పాటు– మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. నిన్న (ఆదివారం) సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈరోజు (సోమవారం) మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. సురేష్‌కు కోర్టు 14 రోజుల పాటు– రిమాండ్ విధించగా.. వెంటనే అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. నెలల తరబడి నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు మాజీ ఎంపీపై 12 కేసులు ఉండగా.. ఇప్పుడు 13వ కేసు నమోదు అయినట్లు– తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. మరో రెండు కేసులు నమోదు అయితే నందిగం సురేష్‌పై పీడీ యాక్ట్ పెట్టేందుకు సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విజయనగరంలో ఉగ్రమూలాల కేసు విచారణ

- నిందితులు ఇద్దరినీ కస్టడీకి కోరుతున్న పోలీసులు

**అమరావతి,మే19( వెలుతురు):**

విజయనగరంలో ఉగ్రమూలాల కేసు విచారణలో పోలీసులు జోరు పెంచారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న సిరాజ్, సమీర్ కస్టడీ కోసం కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఇద్దరినీ కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితులకు నిధులు ఎవరు సమకూర్చారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన సూత్రధారుల గుర్తింపు కోసం దర్యాప్తు ప్రారంభించారు.ఇద్దరికీ సౌదీ అరేబియా నుంచి ఐసిస్ మాడ్యుల్ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. గతంలో రంపచోడవరం అటవీ ప్రాంతంలో వీరు బాంబు పనితీరుపై రిహార్సల్స్ చేసినట్లు– గుర్తించారు. గత 6 నెలల్లో సిరాజ్ 3 సార్లు సౌదీ వెళ్లినట్లు పోలీసులకు వివరాలు అందాయి. అందిన సమాచారాలపై నిర్ధరణకు సిరాజ్, సమీర్‌ను పోలీసులు కస్టడీకి కోరనున్నారు. మరోవైపు విజయనగరంలో ఉగ్రమూలాల కేసులో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ఈ కేసులో నిందితులు సిరాజ్, సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక అంశాలు ప్రస్తావించినట్లు– సమాచారం. సమీర్, సిరాజ్ కలిసి అల్‌హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ సంస్థను స్థాపించారు. ఆరుగురు వ్యక్తులు ఇన్‌స్టా గ్రూప్ క్రియేట్ చేసుకోగా.. ఇందులో సిరాజ్, సమీర్‌తో పాటు– కర్ణాటక, మహారాష్ట్ర యువకులు ఉన్నారని గుర్తించారు. ఈ ఆరుగురి ముఠా 3 రోజుల పాటు– హైదరాబాద్‌లో



కలిసే ఉంది. ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాల అమలుపై వీరు చర్చించారు. సమీర్, సిరాజ్ పేలుడు పదార్థాలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టారు. యూట్యూబ్‌లో పేలుడు పదార్థాల తయారీ విధానం చూశారు. బాంబులు తయారు చేయాలని ఇద్దరికి సౌదీ నుంచి ఆదేశాలు రాగా.. మిగతా నలుగురికి బాంబులు పెట్టే టార్గెట్లు– గుర్తించాలని ఆదేశాలు వచ్చాయి. మరోవైపు అరెస్టు సమయంలో సిరాజ్ వద్ద భారీగా పేలుడు పదార్థాలు లభించాయి. ఈ కేసు విషయంలో ఎన్ఐఏ అధికారులు విజయనగరం టూటౌన్ స్టేషన్‌కు వెళ్లారు. కేసుకు సంబంధించిన విషయాలపై అక్కడి పోలీసులతో ఎన్ఐఏ అధికారులు మాట్లాడారు. మరోవైపు సమీర్ కాంటాక్టులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సికింద్రాబాద్‌లో లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తోన్న సమీర్.. తల్లి, సోదరితో కలిసి సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆ కాలనీ వద్ద పోలీసులు నిఘా పెట్టారు.

## కల్తీ మద్యం కేసులో ప్రత్యేక టాస్‌ఫోర్స్

- ముగ్గురు సభ్యులుతో బృందం ఏర్పాటు


**అమరావతి,మే19( వెలుతురు):**

జంగారెడ్డి గూడెం కల్తీ మద్యం కేసులో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక టాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 2022 మార్చిలో కల్తీ మద్యం కారణంగా చోటు– చేసుకున్న మరణాలపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం ముగ్గురు అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు– చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందానికి ఏలూరు ఎస్పీ కిశోర్ నేతృత్వం వహించగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వేణు ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఉంటారు.

కల్తీ మద్యం కారణంగా చోటు– చేసుకున్న మరణాలకు సంబంధించి జంగారెడ్డి గూడెం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల పరిస్థితిపైనా అధ్యయనం చేయాలని టాస్క్‌ఫోర్స్‌కు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరణాలపై లోతుగా అధ్యయనం చేసి, బాధ్యులెవరో గుర్తించాలని, సాంకేతికపరమైన సిఫార్సులు కూడా చేయాలని ఆదేశించింది. కల్తీ మద్యం కారణంగా దాదాపు 22 మంది అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# నిఘా ఏజెంట్లతోనూ జ్యోతి మల్హోత్రాకి సంబంధాలు

- పాక్ హైకమిషన్ వ్యక్తితో కలసి ఉన్న ఫోటోలు గుర్తింపు



**న్యూఢిల్లీ,మే19( వెలుతురు):**

పాకిస్తాన్ కు కీలకమైన భారత ఆర్మీ సమాచారాన్ని చేరవేస్తున్నట్లు– గుర్తించి అరెస్ట్ చేసిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా గూఢచర్యం కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్ నిఘా ఏజెంట్లతో ఆమె సన్నిహితంగా ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు రోజుల తర్వాత న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌కు కేక్ తీసుకువస్తున్న వ్యక్తితో మల్హోత్రా కలిసి ఉన్న ఓ ఫోటో బయటకొచ్చింది. పాకిస్తాన్ పర్యటన సందర్భంగా.. జ్యోతి తాను హాజరైన పార్టీలో కేక్ తెచ్చిన వ్యక్తిని కలిసినట్లు– ఉన్న ఫోటో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో జ్యోతిపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధాలున్నట్లు– ఇప్పటికే అధికారులు గుర్తించారు. భారత్– పాకిస్తాన్ మధ్య వివాదం తరువాత, పోలీసులు, వివిధ నిఘా సంస్థలు దేశవ్యాప్తంగా సామాజిక వ్యతిరేక శక్తులపై చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ సహకారంతో గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతోపాటు– ఇప్పటిరకు 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com